# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :246 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 06-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఢిల్లీలో మెరుగుపడిన గాలి నాణ్యత.. 165గా ఏక్యూఐ లెవల్స్

ఢిల్లీలో వాయు కాలుష్యం మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 165గా నమోదైంది.ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 178, ఛాందినీ చౌక్ వద్ద 194, ఐటీవో ప్రాంతంలో 130, ఘాజీపూర్‌లో 152, ఓఖ్లా ఫేజ్-2 వద్ద 147, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 145, పట్పర్గంజ్‌లో 164, ఆయా నగర్‌లో 107, లోధి రోడ్డులో 128, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద 162, పంజాబీ భాగ్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 152గా నమోదైంది. అదే సమయంలో కొన్ని ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత పూర్ కేటగిరీలో నమోదైంది. ఆర్కేపురంలో 204, ముండ్కాలో 222, షాదీపూర్‌లో 249, నెహ్రూ నగర్‌లో 247, జహన్‌గిర్‌పురిలో 206గా గాలి నాణ్యత సూచీ నమోదైంది.గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్ధం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

## ఆత్మగౌరవంతో జీవించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం



హైదరాబాద్: ఆత్మగౌరవంతో బతకాలనేది పేదల కల అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్ ను ఇవాళ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ%ౌ% "రోటీ, కపడా, ఔర్ మకాన్ అనేది ఇందిరమ్మ నినాదమన్నారు. ఇల్లు, వ్యసాయ భూమిని ప్రజలు ఆత్మగౌరవంగా భావిస్తామని పేర్కొన్నారు. అందుకే ఇందిరాగాంధీ దశాబ్దాల క్రితమే ఇళ్లు, భూపంపిణీ పథకాలను ప్రారంభించారని గుర్తు చేశారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చు కానీ.. ఇందిరమ్మ కాలనీ లేని ఊరు లేదన్నారు.రూ. 10వేలతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇవాళ రూ. 5లక్షలకు చేరుకుందన్నారు రేవంత్. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి రూ. 5లక్షల ఆర్థిక సాయం చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన వారికే ప్రభుత్వ ఇల్లు చెందాలనేది ఈ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. గతంలో కేసీఆర్ రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించామని అంటూ.. తొలి దశలో 4.50లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చాం" అని రేవంత్ అన్నారు.కాగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం మొబైల్ యాప్ ద్వారా శుక్రవారం నుంచి లబ్ధిదారుల పేర్లను నమోదు చేయనున్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్ ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపిక చేయనున్నారు.

### మమ్మల్ని ఇరుకున పెట్టండి..

ప్రభుత్వానికి విపక్షాలు సూచనలు ఇచ్చే సంప్రదాయం గతంలో ఉండేదని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. ఆ సంప్రదాయాన్ని ఇప్పుడు దెబ్బతీస్తున్నారన్నారు. పాలక, ప్రతిపక్షాలు శత్రుపక్షాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. పాలక, ప్రతిపక్షాలు కలిస్తేనే ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో ఇరుపక్షాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందన్నారు. పెద్దమనిషిగా కేసీఆర్ సూచనలు చేయాలని హితువుపలికారు. "మాకేమీ భేషజాలు లేవు.. పాలక పక్షాన్ని ప్రశ్నించండి. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలి. అవసరమైన సూచనలు చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరు ఒక్కపైసా ఇవ్వొద్దు..

హైదరాబాద్,ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరు ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదని రెవెన్యూ, ఐ అండ్ పీఆర్, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఇవాళ సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ అప్లికేషన్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇండ్లు ఇస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఇండ్లు ఇస్తామని తెలిపారు. ఎవరూ ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక్క పైసా ఇవ్వొద్దని తెలిపారు. మేము ఏ గ్రామంలో వెళ్లిన ఇందిరమ్మ ఇండ్లు చూపిస్తూ మళ్ళీ ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకున్నారన్నారు. గత ప్రభుత్వం లక్షా 62 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తామని టెండర్లు పిలిచి.. కేవలం 62 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారని మంత్రి పొంగులేటి విమర్శించారు.నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరు పేదలను విస్మరించిందని మంత్రి తెలిపారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో 18 లక్షల 56 వేల ఇండ్లు ఇందిరమ్మ ఇండ్లు కట్టామని క్లారిటీ ఇచ్చారు. మిగిలిన ఇండ్లను ఇందిరమ్మ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. పేద వాడి చిరు ఆశ.. చివరి ఆశ ఇండ్లు అని మంత్రి తెలిపారు. ప్రతీ



నియోజకవర్గంలో 3500 ఇండ్లు, ప్రతీ ఇంటికి రూ. 5 లక్షల రూపాయలు, 400 చదరపు అడుగుల ఇండ్లు ఇస్తామన్నారు. నాలుగు విడతల్లో ఇండ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ప్రజాపాలనలో లక్షలాది దరఖాస్తులు వచ్చాయన్నారు. రేపటి నుంచి ప్రతీ గ్రామానికి అధికారులు వెళ్లి సర్వే చేస్తారన్నారు. ఎవరు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక్క పైసా ఇవ్వొద్దని మంత్రి తెలిపారు. అర్హులైన పేదలకు ఇండ్లు ఇస్తాం.. పార్టీలకు అతీతంగా ఇండ్లు ఇస్తామని మంత్రి క్లారిటీ ఇచ్చారు.

## పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం కొనుగోలు..

అమరావతి,పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 26 జిల్లాల కలెక్టర్లు, సివిల్ సప్లై శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.. ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు కూడా హాజరయ్యారు.. కాగా, ఏపీ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లకు ఏపీ సర్కార్ సాంకేతికను వినియోగిస్తుంది. అలాగే ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.. అయితే, గత ప్రభుత్వ హయాంలో రైతుల దగ్గర ధాన్యం కొని, నెలల తరబడి డబ్బులు చెల్లించలేదన్న విమర్శల నేపథ్యంలో.. ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిన కూటమి ప్రభుత్వం.. ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులపై దృష్టిసారించింది..ఇక, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు ధాన్యం విక్రయించుకొనే విధానాన్ని ప్రభుత్వం సులభతరం చేస్తూ కీలక మార్పులు తీసుకువచ్చింది. రైతులు తమ పంటను జిల్లాలో ఎక్కడైనా, ఏ రైస్ మిల్లుకైనా అమ్ముకొనే విధానాన్ని అమలుచేస్తుంది. అదే విధంగా వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయాలు చేసేందుకు సులభ విధానం అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు.. ఉత్తరాంధ్ర జిల్లాల సమీక్ష సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి నాదెండ్ల



మనోహర్.. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నిధులు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు.. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా లక్షా 61 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఇక, చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు మంత్రి మనోహర్.. సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్.. ఈ రోజు రాత్రికి సీఎం విశాఖపట్నం వెళ్లనున్న విషయం విదితమే..

## షిండే శకం ముగిసింది.. ఆయన మళ్లీ సీఎం కాలేరు



ముంబై:మహారాష్ట్రలో గత పది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని బీజేపీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లు ఎన్నికయ్యారు. ఇవాళ సాయంత్రం 5:30 గంటలకు ఫడ్నవీస్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇక షిండే శకం ముగిసింది' అని వ్యాఖ్యానించారు. ఏక్‌నాథ్ షిండే ని బీజేపీ ఇన్ని రోజులూ ఉపయోగించుకుందని.. ఇప్పుడు మాత్రం పక్కకు నెట్టేసిందని వ్యాఖ్యానించారు. 'షిండేని బీజేపీ పావులా వాడుకుంది. ఇప్పుడు పక్కకు నెట్టేసింది. ఇక షిండే శకం ముగిసింది. ఆయన మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరు. ఆయన అవసరం కూడా బీజేపీకి లేదు. అవసరమైతే షిండే పార్టీని కూడా బీజేపీ విచ్ఛిన్నం చేయగలదు. ఇది ప్రధాని మోదీ రాజకీయ పంథా' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మహాయుతికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ.. 15 రోజులైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని రౌత్ అన్నారు. అంటే వారి కూటమిలో ఏదో లోపం ఉందని అర్థమవుతోందన్నారు. అది ఇవాళ కాకపోయినా తర్వాతైనా బయటకి వస్తుందని చెప్పుకొచ్చారు.కాగా, బుధవారం విధాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఫడ్నవీస్‌ను బీజేపీ ఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కానున్నారని, మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతున్నట్టు బీజేపీ పరిశీలకులు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, విజయ్ రూపాని ప్రకటించారు. దీంతో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ సిండే, అజిత్ పవార్ నేతృత్వంలోని మహాయుతి ప్రతినిధి బృందం బుధవారం సాయంత్రం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరింది. గురువారం సాయంత్రం 5.30 గంటలకు దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

### ఉ ముఖ్యమంత్రులుగా షిండే, పవార్

ఫడ్నవీస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రులుగా శివసేన నేత, మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు మొదట షిండే మొండికేశారు. ఆయనను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా బీజేపీ అధిష్ఠానం, ఫడ్నవీస్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదు. చివరకు బుధవారం సాయంత్రం అంగీకరించిన షిండే.. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు.

## రేవంత్ ది ప్రజా పాలన కాదు .. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన



హైదరాబాద్ : ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్ రావు,జగదీష్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే కొత్తకోట ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజ తదితర నేతలను అరెస్ట్ చేయడాన్ని తప్పు పట్టారు ఎమ్మెల్సీ కవిత ఈ మేరకు ఆమె ట్విట్ చేశారు.. ఈ అక్రమ అరెస్ట్ లను తాను ఖండిస్తునట్లు పేర్కొన్నారు.. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదని, ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన అంటూ విమర్శించారు.. అరెస్ట్ చేసిన నేతలందర్నీ వెంటనే విడుదల చేయాలని డిజెపిని కోరారు..

### రాక్షస పాలనే .. హరీశ్ రావు

ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న నేపథ్యంలో రేవంత్ ది ప్రజాస్వామ్య పాలన కాదు.. రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు.ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఉల్టా కేసు బనాయించారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఎమ్మెల్యే ఇంటి మీదకు వచ్చి అక్రమ అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే, నాపై, బీఆర్ఎస్ నాయకులపై దుర్మార్గంగా ప్రవర్తించారు. అక్రమ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నావు. నీ పిట్ట బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళం కాదు. తెలంగాణ సమాజమే నీకు బుద్ధి చెబుతుంది అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## కౌశిక్ రెడ్డిపై కొండా సురేఖ ఘాటు వ్యాఖ్యలు..

హైదరాబాద్,హుజరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు. నిన్న బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హల్ చల్ చేసిన విషయం తెలిసిందే.దీనిపై మంత్రి స్పందిస్తూ.. హుజరాబాద్ ఎమ్మెల్యే వాడో పిచ్చోడంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కౌశిక్ రెడ్డి ఏం మాట్లాడుతాడో తెలియదని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే గొడవ చేస్తాడని అన్నారు. అసెంబ్లీలో చప్పట్లు కొట్టి డాన్సులు చేసే సంస్కృతి ఇంతకుముందు అసెంబ్లీలో లేకుండే అన్నారు. మెదడు లేకుండా కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ని ఫామ్ హౌస్ కి పరిమితం చేసి కేటీఆర్ మాట్లాడుతున్నాడని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం మీద మీ అయ్య (కేసీఆర్)తో మాట్లాడించు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.అధికారంలో ఉన్నప్పుడు నువ్వే రాజు నువ్వే మంత్రి అన్నట్టు నడిపించావని కేటీఆర్ పై మండిపడ్డారు. ప్రతిపక్షంలో కూడా అంతా నువ్వే అన్నట్టు నడిపించాలనుకుంటున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు దోచుకుని.. మీ కుటుంబం బాగు పడిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. మీలాగా రేవంత్ అనుకుంటున్నారు.. మీలాగా కాదు మేము అన్నారు. కేటీఆర్ ఎక్కడ పోయినా వెళ్లగొడుతున్నారని కొండా సురేఖ తెలిపారు. ఆటో వాళ్ల దగ్గరికి పోతే పొమ్మన్నారు..గిరిజనుల దగ్గరికి పోతే వద్దు పొమన్నారు.. ఎమ్మెల్యేల స్థాయి మరిచి మాట్లాడుతూ ఉన్నారని కేటీఆర్ పై కొండా సురేఖ ఫైర్ అయ్యారు.మీరు



పెట్రేగి పోతే ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ తల్లి నీ కేటీఆర్ దొరసాని లెక్క చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత లెక్క వడ్డాణం.. దొరసాని లాగ పెట్టుకున్నారన్నారు. మేము తెలంగాణ నిండుతనం ఉండేలా చూస్తున్నాం అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని వారందరినీ ఇప్పుడు దగ్గరికి తీసుకుంటున్నాడు కేటీఆర్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేక.. ఇప్పుడు మేము ఏం చేసినా ఉద్యమాలు చేస్తామనీ అంటున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మీరు చేసినవన్నీ ఉత్తిత్తి రాజీనామాలే అని అన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి వచ్చారని గుర్తుచేశారు.

## ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తే జైలుకా..?

హైదరాబాద్,డిసెంబర్ 5: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు.. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు.. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు.. చివరకు ప్రజలపై కూడా కేసులు నమోదు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసులు.. కేసులు.. కేసులు.. ఈ పేర్లతో అటు ప్రజలను, ఇటు ప్రతిపక్షాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాసులు మీకు కేసులు మాకు.. సూటుకేసులు మీకు.. అరెస్టులు మాకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు మా నాయకులు




హరీష్ రావు, జగదీష్ రెడ్డి గార్లతోపాటు మా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం.. తక్షణం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చివరగా జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

## హరీశ్ రావుకు ఊరట... అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి హరీశ్ రావును అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అరెస్టు మినహా తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని హరీశ్‌రావుకు సూచించింది. హరీశ్‌పై ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీసింది. విచారణను రెండు వారాలు వాయిదా వేసింది.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న హరీశ్ రావును అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేశారు.పంజాగుట్ట పీఎస్‌లో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని అందులో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు.

సంపాదకీయం

శుక్రవారం 06-12-2024

# మాస్కోతో మైత్రికి మరో ముడి

ఏదైనా అణ్వస్త్ర దేశంతో కలిసి ఉక్రెయిన్ తనపై దాడిచేస్తే, దాన్ని ఉమ్మడి దాడిగా పరిగణించి అణ్వస్త్రాలతో తిరుగుదాడి చేస్తామని రష్యా ప్రకటించింది. తద్వారా అది అమెరికా మిత్ర దేశాలను పరోక్షంగా హెచ్చరించింది. ఏదైనా అణ్వస్త్ర దేశంతో కలిసి ఉక్రెయిన్ తనపై దాడిచేస్తే, దాన్ని ఉమ్మడి దాడిగా పరిగణించి అణ్వస్త్రాలతో తిరుగుదాడి చేస్తామని రష్యా ప్రకటించింది. తద్వారా అది అమెరికా మిత్ర దేశాలను పరోక్షంగా హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పుతిన్ త్వరలో భారతదేశంలో పర్యటించనుండటం ఆసక్తికరం. ఆయన ఇండియా పర్యటనను రష్యా అధ్యక్ష కార్యాలయం తాజాగా ధ్రువీకరించింది. త్వరలోనే తేదీలను ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది. ఈఏడాది జులైలో మాస్కోలో జరిగిన వార్షిక ద్వైపాక్షిక సమావేశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. 2022లో ఉక్రెయిన్‌తో యుద్ధం ఆరంభమైన తరవాత మోదీ రష్యా వెళ్లడం అదే మొదటిసారి. చర్చలు, దౌత్యం ద్వారా రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించాలని మోదీ కోరుతున్నారు. తరవాత ఆగస్టులో ఆయన ఉక్రెయిన్ వెళ్లి అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ సమావేశమయ్యారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై ఉక్రెయిన్ ప్రత్యేక దేశంగా ఏర్పడిన తరవాత ఒక భారత ప్రధాని దాన్ని సందర్శించడం అదే ప్రథమం. యుద్ధ విరమణ దిశగా భారత్ శాంతి సదస్సు నిర్వహించాలని మోదీకి జెలెన్‌స్కీ సూచించారు. అనంతరం అక్టోబరులో రష్యాలోని కజాన్‌లో 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోదీ, పుతిన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే పుతిన్ త్వరలో ఇండియాకు వస్తారనే ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ట్రంప్ గెలుపుతో...

పుతిన్ 2000 సంవత్సరంలో భారత పర్యటనకు వచ్చినప్పుడు రెండు దేశాల మధ్య వ్యూహపరమైన భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. అప్పటి నుంచి ఏటా ద్వైపాక్షిక సమావేశం నిర్వహిస్తున్నారు. 2010లో ఆ ఒప్పందాన్ని ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం స్థాయికి పెంచారు. భారత్, రష్యా వార్షిక సమావేశానికి కొవిడ్–19 వల్ల తాత్కాలికంగా విరామం వచ్చింది. చివరిసారిగా ఈ భేటీని 2021లో చేపట్టగా, మళ్లీ దాన్ని ఈ ఏడాది జులైలోనే నిర్వహించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నందుకు రష్యాపై అమెరికా కూటమి ఆర్థిక ఆంక్షలు విధించింది. దాంతో రష్యా చైనాకు దగ్గరవడం... అమెరికా, పశ్చిమ ఐరోపా దేశాలతో భారత్‌కు సాన్నిహిత్యం పెరగడం వంటి కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో రష్యాతో తన బంధాన్ని భారత్ నేర్పుగా నిభాయించుకురావాల్సి ఉంది. మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల మధ్య తాము చాలా జాగ్రత్తగా అడుగులు వేయాలని రెండు దేశాలకూ తెలుసు. వచ్చే జనవరిలో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆ క్రమంలోనే పుతిన్ భారతదేశ సందర్శనకు సిద్ధమవడం గమనార్హ పరిణామమని లండన్ కింగ్స్ కళాశాల అధ్యాపకుడు, భారత్‌లో అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడైన హర్ష్ వి.పంత్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలయ్యాక పుతిన్ భారత్‌లో పర్యటించలేదు. మోదీ మాత్రం రెండుసార్లు రష్యా వెళ్లారు. అందువల్ల తాను కూడా భారత్‌ను సందర్శించాలని భావిస్తున్న పుతిన్– వీలైనంత త్వరగా దాన్ని పూర్తిచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ అధ్యక్షుడైన తరవాత ఏ క్షణాన ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేం. ఈ సంగతి పుతిన్‌కు బాగా తెలుసు. అందువల్ల ఆ లోపే భారత్‌కు వచ్చి ద్వైపాక్షిక సహకారానికి రోడ్‌మ్యాప్ నిర్ణయించాలని ఆయన కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రష్యా, చైనా అత్యంత సన్నిహితంగా మెలగుతున్నాయి. ట్రంప్ చైనా పట్ల కఠిన వైఖరి అవలంబిస్తారు. కాబట్టి, భారత్‌తో చెలిమి కీలకమని పుతిన్ గుర్తించి ఉండవచ్చు. ఇండో–పసిఫిక్ క్వాడ్‌లో భారత్ కూడా భాగస్వామి. జపాన్ తూర్పుతీరం మొదలుకొని ఆఫ్రికా తూర్పుతీరం వరకు చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవడానికి అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో క్వాడ్ ఏర్పడింది. ట్రంప్ చైనాకు వ్యతిరేకంగా క్వాడ్‌ను ప్రోత్సహిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి ట్రంప్ భారతదేశ మధ్యవర్తిత్వాన్ని ఆహ్వానించే అవకాశముందని కొందరు భావిస్తున్నారు. ఇమాజిన్ ఇండియా సంస్థ అధ్యక్షుడు రవీందర్ సచ్‌దేవ్ అభిప్రాయమూ ఇదే. "మోదీ ఈ ఏడాది జులైలో పుతిన్‌తో, ఆగస్టులో జెలెన్ స్కీతో భేటీ అయ్యారు. సెప్టెంబరులో జరిగిన క్వాడ్ సభలో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో చర్చలు జరిపారు. అదే నెలలో ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశంలో జెలెన్ స్కీతో విడిగా మాట్లాడారు. మళ్లీ అక్టోబరు బ్రిక్స్ సభలో పుతిన్‌తో సమావేశమయ్యారు. ఇలా మోదీ అందర్నీ ఒక దఫా కలిశారు. ఇప్పుడు మలిదఫా సంప్రతింపులకు నాంది పడుతోంది" అని సచ్‌దేవ్ విశ్లేషించారు. తాను అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగింపజేస్తానని ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

కీలక ఒప్పందాలకు అవకాశం

పుతిన్ భారత పర్యటనకు వచ్చినపుడు ద్వైపాక్షిక వాణిజ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవడం ఖాయం. 2025కల్లా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 3000 కోట్ల డాలర్లకు, పెట్టుబడులను 5,000 కోట్ల డాలర్లకు పెంచాలని మోదీ, పుతిన్‌లు గతంలోనే నిశ్చయించారు. 2023–24లో భారత్ రష్యా నుంచి 6,144 కోట్ల డాలర్ల విలువైన సరకులను దిగుమతి చేసుకుంది. రష్యాకు 426 కోట్ల డాలర్ల సరకులను ఎగుమతి చేసింది. రష్యాతో భారత్‌కు వాణిజ్య లోటు ఉంది. పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఉన్నాసరే, భారత్ పెద్దయెత్తున రష్యన్ చమురును దిగుమతి చేసుకుంది. 2024 జనవరి–సెప్టెంబరు మధ్య రోజూ 17 లక్షల పీపాల చొప్పున రష్యన్ చమురు దిగుమతి అయింది. చెన్నై–వ్లాదివొస్తోక్ రేవుల మధ్య నౌకా రవాణాను ప్రారంభించిన భారతదేశం త్వరలో విశాఖపట్నం, పారదీప్ రేవుల ద్వారా రష్యాకు ఎగుమతులు చేయదలచిందని కేంద్ర నౌకాయాన మంత్రి సర్బానంద సోనోవాల్ ఇటీవల వెల్లడించారు. కాబట్టి, పుతిన్ భారతదేశ యాత్రలో పలు ముఖ్యమైన ఒప్పందాలు కుదిరే అవకాశముంది.

# బాదల్ కుటుంబంపై ఖలిస్థానీల కన్ను..?

ఇంటర్నెట్‌డెస్క్: పంజాబ్‌పై తిరుగులేని పట్టుతో కొన్ని దశాబ్దాల పాటు అక్కడి రాజకీయాలను శాసించిన బాదల్ ఫ్యామిలీ ఇప్పుడు కష్టాల్లో ఉంది. ఓ వైపు మతపరమైన శిక్షలకు గురికాగా.. ఇప్పుడు ఖలిస్థానీల గురిలోకి కూడా వచ్చింది. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయ ప్రాంగణంలో ఏకంగా పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్(%ంబఎప్రఏఱతీ ంఱఅస్త్ర%)పైనే తుపాకీ కాల్పులు జరగడంతో దేశం ఉలిక్కిపడింది. పంజాబ్‌లో 'ఫస్ట్‌ఫ్యామిలీ'గా కొన్ని దశాబ్దాలపాటు చలామణి అయిన బాదల్ కుటుంబం రాజకీయంగా కష్టకాలంలో ఉన్న ఈ సమయంలో దాడి జరగడం చర్చనీయాంశమైంది. సిక్కు ప్రయోజనాల కోసం పనిచేసే శిరోమణి అకాలీదళ్ పార్టీ సుఖ్‌బీర్‌ను అధ్యక్ష పదవిని వీడమనటం, సిక్కులకు ద్రోహం చేసిన వ్యక్తి (తంఖయ్యా)గా ఆయన్ను ప్రకటించడం ఆ ఫ్యామిలీకి పెద్ద ఎదురుదెబ్బలు.



పంజాబ్ ఫస్ట్ ఫ్యామిలీగా ఓ వెలుగు వెలిగి..

1947లో పంజాబ్ రాజకీయాల్లోకి బ్లాక్ సమితి ఛైర్మన్‌గా అడుగుపెట్టిన ప్రకాశ్ సింగ్ బాదల్ ఆ తర్వాత పదేళ్లలోనే అకాలీదళ్ తరఫున రాష్ట్ర విధాన సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచలంచెలుగా ఎదిగి.. 1970లో తొలిసారి సీఎం పీఠంపై కూర్చొన్నారు. ఆ తర్వాత 1977–2017 మధ్యలో నాలుగుసార్లు ఆయన ముఖ్యమంత్రిగా పాలించారు. ఈ కాలంలో పంజాబ్‌పై బాదల్ కుటుంబానికి బలమైన పట్టుంది. ప్రకాశ్‌సింగ్‌కు కుమారుడు సుఖ్‌బీర్ సింగ్, కుమార్తె ప్రణీత్ కౌర్ కైరాన్ ఉన్నారు. తరచూ మీడియా ఈ కుటుంబాన్ని పంజాబ్ ఫస్ట్ ఫ్యామిలీగా అభివర్ణించేది. సుఖ్‌బీర్ కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా పని చేశారు. ఆయన భార్య హర్ సిమ్రత్ కౌర్ కూడా కేంద్ర మంత్రిగా పనిచేశారు. సుఖ్‌బీర్ సోదరి ప్రణీత్ కౌర్ కైరాన్, ఆమె భర్త ఆదేశ్ ప్రతాప్‌సింగ్ కైరాన్ కూడా నాలుగు సార్లు అకాలీ దళ్ తరఫున ఎమ్మెల్యేగా పనిచేశారు.

తండ్రి నీడలో ఎదిగి..

వారసుడిగా సుఖ్‌బీర్‌ను ముందుకుతెచ్చే క్రమంలో పెద్ద నాయకులను సైతం రాజకీయంగా పక్కకు తప్పించేవారు ప్రకాశ్‌సింగ్ బాదల్. 1996లో కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు పటియాల టికెట్ నిరాకరించారు. దీంతో ఆయన కాంగ్రెస్ గూటికి తిరిగి చేరిపోయారు. పార్టీలో సుఖ్‌బీర్‌ను సవాలు చేసేవారు లేకుండా చేసి 2008లో అతనికి పగ్గాలు అందించారు. అప్పటికి ఆయన వయసు కేవలం 45 ఏళ్లు మాత్రమే. నాటినుంచి నేటివరకు అకాలీదళ్ నాయకత్వం ఆయన వద్దే ఉంది.

ఖలిస్థానీకి వ్యతిరేకంగా..

పంజాబ్‌లో అకాలీదళ్ పట్టును సడలించేందుకు తెరపైకి వచ్చిన ఖలిస్థాన్ ఉద్యమం బాదల్ కుటుంబానికి ఇబ్బందికరంగా మారింది. భింద్రన్ వాలాపై సైనిక చర్యలకు ప్రకాశ్‌సింగ్ మద్దతు పలికారని కొన్నాళ్ల కిందట ఆ రాష్ట్ర మాజీ సీఎం అమరీందర్ సింగ్ వెల్లడించారు. కానీ, కొన్నేళ్లుగా పంజాబ్‌లో వేర్పాటువాదంపై అకాలీదళ్ వైఖరిలో కొంత మార్పు వచ్చింది. కానీ, తాజాగా ఖలిస్థానీ మద్దతుదారు సంస్థ బబ్బర్ ఖల్సాకు చెందిన నరైన్ చౌరా అనే మిలిటెంట్ సుఖ్‌బీర్‌పై స్వర్ణ దేవాలయంలో దాడికి పాల్పడ్డాడు. 1984లో పంజాబ్‌లో ఉగ్రవాదం పెరిగిన సమయంలో నరైన్ పాకిస్థాన్‌కు వెళ్లినట్లు వార్తలొస్తున్నాయి.

ఇప్పుడు తంఖయ్యాగా ఎందుకు..?

మతపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు సిక్కుల అత్యున్నత స్థానమైన శ్రీఅకాల్‌తక్త్ సాహెబ్ డిసెంబర్ 2న సుఖ్‌బీర్‌ను తంఖయ్య (దోషి)గా ప్రకటించింది. ఆయనతోపాటు మరో 12 మంది అకాలీదళ్ నేతలను మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వర్ణదేవాలయ ప్రాంగణంలో రెండ్రోజులపాటు వాష్‌రూమ్‌లను కడగడం, ఊడ్చడం, గిన్నెలు తోమడం వంటి పనులు చేయాలని ఆదేశించింది. ఈ శిక్షను పాటించకపోతే వారిని మత బహిష్కరణ చేసే అవకాశం కూడా ఉంది. అంతేకాదు దివంగత ప్రకాశ్‌సింగ్ బాదల్‌కు ఇచ్చిన 'ఫకర్ ఈ క్వామ్' గౌరవాన్ని కూడా వాపస్ తీసుకొంది. 2007–17 మధ్యలో అకాలీదళ్–భాజపా ప్రభుత్వం ఉన్న సమయంలో తీసుకొన్న కొన్ని మతపరమైన తప్పుడు నిర్ణయాలకు ఈ శిక్షను విధించింది. ఈ తప్పులకు సుఖ్‌బీర్ బేషరతుగా క్షమాపణలు కూడా చెప్పారు. పంజాంబ్‌లోని పెద్ద రాజకీయ నాయకులకు కూడా గతంలో ఈ శిక్ష అమలైంది. మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్, కాంగ్రెస్ నేత బూటా సింగ్, మాజీ సీఎంలు సుర్జీత్ సింగ్ బర్నాల, కెప్టెన్ అమరీందర్ సింగ్ వంటి వారిని కూడా తంఖయ్యలుగా ప్రకటించారు.

# ఈవీఎంలపై మరిన్ని అనుమానపు మబ్బులు!




న్యూఢిల్లీ,దేశ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఈవీఎం)పై మరోసారి గట్టిగా గొంతెత్తింది. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపరుతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఈవీఎంలపై సందేహాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని, వాటిని తీసేసి అహ్మదాబాద్ గోడౌన్‌లో పెట్టాలని విమర్శించారు. బీజేపీ ఈవీఎంల సాయంతో దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ధ్వజమెత్తారు. ఇటీవలి కాలంలో ఈవీఎంలపై ఆరోపణలు పెరిగిపోతున్న మాటైతే నిజం. వాటి పనితీరు, ట్యాంపరింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయి. ఇలాన్ మస్క్ లాంటి టెక్ దిగ్గజాలు ఈవీఎంలను నియంత్రించవచ్చునని అంటున్నారు. అయితే ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని ఖండించాల్సిన, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల సంఘం ఆ పని సమర్థంగా చేయలేకపోతోంది. దీంతో అందరి అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పుడు కూడా ఈవీఎంల పనితీరుపై పలు సందేహాలు వచ్చాయి. ఆ తర్వాత హర్యానా, తాజాగా మహారాష్ట్రలోనూ ఈవీఎమ్‌లతో ఏదో మోసం జరిగిందన్న అనుమానాలను ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేశాయి. ఇందుకు పలు ఆధారాలను చూపుతున్నా ఎన్నికల కమిషన్ మాత్రం కిమ్మనడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా నిర్దిష్ట సమాధానాలు ఇవ్వకుండా దబాయింపునకే పరిమితం అవుతోంది. అభ్యర్థులు కోరితే వీవీప్యాట్ స్లిప్‌లలో ఐదు శాతం ఈవీఎంలతో సరిపోల్చాలని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పిచ్చినా ఎన్నికల సంఘం దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలందరి అంచనాలను తారుమారు చేస్తూ వైఎస్సార్‌సీపీకి కేవలం11 స్థానాలే దక్కడం కూడా ఈవీఎంలపై అనుమానాలు వచ్చేందుకు ఆస్కారం కల్పించాయి. ఒంగోలు, విజయనగరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీవీప్యాట్ స్లిప్‌లను, ఈవీఎంలలోని సమాచారంతో సరిపోల్చి చూడాలని ఫీజులు చెల్లించి మరీ ఎన్నికల సంఘాన్ని కోరినా ఎన్నికల సంఘం దాటవేయడం ఇంకో అనుమానాస్పద చర్య. పైగా ఏపీలో అప్పటి ఎన్నికల ముఖ్య అధికారి పోలింగ్ అయిన పది రోజులకే వీవీపాట్ స్లిప్‌లను దగ్ధం చేయాలని ఆదేశాలు పంపడం వాటిని మరింత పెంచింది. ఆశ్చర్యకరంగా కొన్ని బూత్ లలో వైఎస్సార్‌సీపీకి ఒక్క ఓటే నమోదైంది. హిందుపూర్‌లోని ఒక వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఇంట్లోనే ఏడు ఓట్లు ఉంటే, సంబంధిత బూత్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఒకే ఒక్క ఓటు వైఎస్సార్‌సీపీకి నమదైంది. ఇదే బూత్‌లో వైఎస్సార్‌సీపీ లోక్‌సభ అభ్యర్థికి మాత్రం 475 ఓట్లు రావడం విశేషం. క్రాస్ ఓటింగ్ జరిగినా అది ఈ స్థాయిలో ఉండటం అసాధ్యం. ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్, కౌంటింగ్‌ల మధ్యలో సుమారు 49 లక్షల ఓట్లు అధికంగా నమోదై ఉండటం, ఈవీఎంల బ్యాటరీ ఛార్జింగ్‌లో తేడాలు ఉండటం మనం ఇప్పటికే చూశాం. పోలింగ్ నాడు ఏభై శాతం మాత్రమే ఉన్న బాటరీ ఛార్జింగ్, కౌంటింగ్ నాటికి 90 శాతానికి చేరడం పెద్ద మిస్టరీగా మిగిలిపోయింది. మాజీ మంత్రి రోజా వైఎస్సార్‌సీపీకి అత్యధిక బలం ఉన్న వడమాల పేట మండలంలో టీడీపీకి మెజార్టీ రావడంపై సంశయాలు వ్యక్తం చేశారు. నగరి నియోజకవర్గంలో సీనియర్ నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు రెండు, మూడువేల ఓట్ల ఆధిక్యతతోనే గెలుపొందగా, ఆయన కుమారుడు టీడీపీ పక్షాన పోటీచేయగా ఏకంగా నలభైవేల ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇంతటి ఆధిక్యత టీడీపీకి రావడం ఎలా సాధ్యమైందని రోజా ప్రశ్నిస్తున్నారు. ఏదో మతలబు ఉందన్నది ఆమె అనుమానం. వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించాలని కోరిన అప్పటి ఒంగోలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ తర్వాత కాలంలో జనసేన పార్టీలో చేరి దీని గురించి మాట్లాడకపోవడం కూడా గమనించాల్సిన అంశమే. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శాసనసభ ఎన్నికలలో మోసం జరిగిందని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత ఆయన ఈవీఎంల ద్వారా కాకుండా బాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు జరగడం మంచిదని సూచించారు. రాజ్యాంగ దినోత్సవం నాడు ఆయన ఒక సందేశం ఇస్తూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిజాయితీగా జరగడమే కాకుండా.. అలా జరుగుతున్నాయన్న నమ్మకాన్ని కూడా కలిగించాలని అన్నారు. అంతేకాదు.. ఒకప్పుడు ఈవీఎంలపై పలు విమర్శలు చేయడమే కాకుండా.. బ్యాలెట్ల పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని జాతీయ స్థాయిలో డిమాండ్ చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పుడు మాత్రం ఈ ఆరోపణలపై స్పందించక పోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. దురదృష్టవశాత్తు న్యాయ వ్యవస్థ కూడా దీనిపై తగిర రీతిలో స్పందించినట్లు కనిపించడం లేదు. ఒడిశా అసెంబ్లీ ఎన్నికలలో ఏభై సీట్లు గెలుచుకున్న బీజేపీ అదేరోజు జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఒక్క సీటు గెలవకపోవడం కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏపీ, ఒడిశాల తర్వాత హర్యానా ఎన్నికలలో కూడా దాదాపు అన్ని సర్వే సంస్థలు కాంగ్రెస్ గెలుస్తుందని అంచనా వేశాయి. ఫలితాల ట్రెండ్ కూడా తొలుత దానికి అనుగుణంగానే కనిపించింది. కానీ ఆ తర్వాత వాతావరణం మొత్తం బీజేపీకి అనుకూలంగా మారింది. ఇదంతా ఈవీఎమ్‌ల మహిమే అని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అక్కడ వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించాలని కోరినా, ఎన్నికల సంఘం స్పందించినట్లు లేదు. తాజాగా మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో బీజేపీ కూటమి అనూహ్యమైన రీతిలో విజయం సాధించడంతో ఈవీఎంల టాంపరింగ్ పై కాంగ్రెస్ తో సహా వివిధ పక్షాలు ఆరోపణలు చేశాయి. అక్కడ కూడా పోలింగ్ నాటికి, కౌంటింగ్ నాటికి మధ్య లక్షల ఓట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఒక నియోజకవర్గంలో 1170 ఓట్లు అధికంగా నమోదు అయ్యాయని తేలిందట. అక్కడ బీజేపీ అభ్యర్ధి సుమారు 1100 ఓట్లతో గెలిచారట. నాందేడ్‌లో కూడా ఓట్ల శాతంలో మార్పులు కనిపించాయి. అక్కడ లోక్ సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే, ఆరు సెగ్మెంట్ లలో బీజేపీ గెలించింది. ఎన్నికల ఫలితాలు వస్తున్న సమయంలోనే శివసేన నేత సంజయ్ రౌత్ ఇదంతా ఈవీఎంల టాంపరింగ్ మహిమే అని వ్యాఖ్యానించారు. ఆరు నెలల క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ కూటమి 30 సీట్లు గెలుచుకుంది. అసెంబ్లీ ఎన్నికలలో దారుణంగా 288 సీట్లకుగాను, ఏభై సీట్లు కూడా సాధించ లేకపోయింది. వీటిని దృష్టిలో ఉంచుకునే మల్లిఖార్జున్ ఖర్గే ఈవీఎంలు వద్దు..బాలెట్ పత్రాలే ముద్దు అని అంటున్నారు. దీని కోసం దేశ వ్యాప్తంగా ప్రచారం చేపట్టాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. ఈవీఎంల ట్యాంపరింగ్ నిజమే అయితే.. జమ్ము–కశ్మీర్, జార?ండ్‌లలో కాంగ్రెస్ కూటమి ఎలా గెలిచిందన్నది బీజేపీ ప్రశ్నిస్తోంది. సీనియర్ నేత శరద్ పవార్ సమాధానం దీనికి ఇస్తూ పెద్ద రాష్ట్రాలలో ఈవీఎంలను మేనేజ్ చేస్తూ, చిన్న రాష్ట్రాలను వదలి పెడుతున్నారని, అందువల్ల ఈ రెండు రాష్ట్రాలలో బీజేపీ ఓడిపోయిందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ మేధావి పరకాల ప్రభాకర్ కూడా ఈ అంశంపై దీనిపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. మహారాష్ట్ర మ్యాజిక్ ఏమిటీ అని అంటూ, ఎన్నికలు జరిగిన నవంబర్ ఇరవయ్యో తేదీ సాయంత్రం ఐదు గంటలకు పోలైన ఓట్ల శాతం 58.22 గా ఉందని, ఆ తర్వాత రాత్రి 11.30 గంటలకు అది 65.02 శాతంగా తేల్చారని, కాని కౌంటింగ్ కు ముందు ఆ శాతం 66.05 శాతం ఈ రకంగా మొత్తం 7.83 శాతం పెరిగిందని, అదే మహారాష్ట్ర మేజిక్ అని వ్యాఖ్యానించారు. అదే మ్యాజిక్ జార?ండ్‌లో ఎందుకు లేదని ప్రశ్నించారు ఆయన. జార?ండ్‌లో తొలిదశలో పోలింగ్ సాయంత్రానికి 64.66 శాతం నమోదైతే, రాత్రి 11.30 గంటలకు 66.48 శాతంగా ప్రకటించారు. అంటే తేడా కేవలం 1.79 శాతమేనని, రెండో దశ పోలింగ్ లో సాయంత్రానికి, రాత్రికి ప్రకటించిన ఓట్ల శాతాలలో తేడా 0.86 శాతమేనని, అంటే ఇక్కడ మాజిక్ తక్కువగా జరిగిందని ప్రభాకర్ సెటైర్ గా వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ఈవీఎంల పలితాలపై నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సంఘం మాజీ ముఖ్య కమిషనర్ ఖురేషి కూడా మహారాష్ట్రలో పోలింగ్ నాటికి, కౌంటింగ్ నాటికి మధ్య ఓట్ల తేడా 7 శాతంపైగా ఉండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యినికి మంచిది కాదని ఆయన అన్నారు. వచ్చే సాధారణ ఎన్నికలలో బాలెట్ పత్రాల వైపు ఎన్నికల సంఘం మొగ్గు చూపకపోయినా, లేదా ఈవీఎంలలో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం లేదని నిరూపించకపోయినా, దేశంలో ఎన్నికలపై నీలి నీడలు అలుముకునే అవకాశం ఉంది. అది ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతుంది.

# పుష్ప2తో దేశమంతా ఊగిపోతోంది..ఎందుకీ క్రేజ్?

సినిమా అత్యంత ప్రభావవంతమైన మాధ్యమం. ప్రాథమికంగా ఇది వినోద ప్రధానమైనది. కానీ, దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సినిమా అద్దం పడుతుంది. ఒక దేశ సంస్కృతి, ప్రజల జీవన పరిస్థితులకు దర్పణం. కాలానికి అనుగుణంగా, ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా సినిమాలు రూపొందుతాయి. అన్ని రంగాల మాదిరిగానే సినీ రంగంలో కూడా జనరేషనల్ షిఫ్ట్ ఉంటుంది. దానిని అందుకున్న వారే విజయవంతమవుతారు. ఇప్పటి వరకు మనం రెండు రకాల సినిమాలను చూశాం. అవి వాస్తవిక చిత్రాలు, కాల్పనిక చిత్రాలు. వీటినే ఆర్ట్ సినిమా, కమర్షియల్ సినిమా అని అంటుంటాం. ఇక, ప్రపంచానికి ఇండియన్ సినిమా అంటే బాలీవుడ్. కానీ ఇప్పుడు ఆ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠ మసకబారుతోంది. దానికి కారణం దక్షిణాది సినిమాల ప్రభావం. భారీ తనంలో హిందీ సిని మా తక్కువేమీ కాదు..కానీ ప్రేక్షకులను మెప్పించటం లో విఫలమవుతున్నాయి. ఏడాదికి ఒకటి రెండు మినహా ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోతున్నాయి. కాగా, తాజాగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న తెలుగు సినిమా పుష్ప2పై దేశ వ్యాప్తంగా ఊహకందని అంచనాలు నెలకొన్నాయి. దక్షిణాది రాష్ట్రాలే కాదు.. బీహార్ సహా యావత్ ఉత్తర భారతదేశం అల్లు అర్జున్ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హిందీ వెర్షన్ అడ్వాన్స్ బుకింగ్‌లో 24 గంటల్లోనే లక్ష టికెట్స్ అమ్ముడయ్యాయంటేనే దీని క్రేజ్ ఏమిటో అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో అయితే బుకింగ్ ఓపెన్ అయిన గంటలోనే ఫస్ట్‌డే టికెట్స్ మొత్తం అమ్ముడయ్యాయి. ఇలా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు సౌత్ నార్త్ ఓవర్సీస్ లో ఏ సెంటర్ చూసినా పుష్ప 2 రికార్డులు ఇపుడు హాట్ టాపిక్. 670 కోట్లకు పైగా థియేట్రికల్ బిజినెస్ అయింది. ఆడియో రైట్స్, డిజిటల్ రైట్స్, ఓటిటి రూపంలో 400 కోట్లు వచ్చినట్టు ఇండస్ట్రీ టాక్. ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమా కూడా ఈ రేంజ్ లో బిజినెస్ చేయలేదు . దాదాపు 1060 కోట్ల బిజినెస్ తో సరికొత్త ట్రెండ్‌ని సెట్ చేస్తోంది. సుమారు 12 వేల 500పైగా థియేటర్లలో విడుదలకాబోతంది. ప్రపంచ వ్యాప్తంగా మొదటి రోజే దాదాపు 55 వేల వేల షోస్ పడుతున్న మొట్టమొదటి తెలుగు సినిమా పుష్ప 2 కావడం విశేషం. 80 దేశాల్లో ఆరు భాష ల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఫస్ట్ డే కలెక్షన్ ప్రపంచ వ్యాప్తంగా 250– 270 కోట్లు ఉంటుందని బాక్సాఫీస్ పండితుల అంచనా. ఈ నెల 5న 'పుష్ప'రాజ్ థియేటర్స్‌లో అడుగుపె డుతున్నాడు. పుష్పతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ఆ చిత్రం ద్వారా జాతీయ ఉత్తమ నటుడు అవార్డు కూడా గెలుచు కున్నారు. ఆ తరంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, చిరంజీవి, ఈ తరంలో ఏ తెలుగ హీరో ఆ అవార్డు దక్కించుకోలే కపోవటం గమనార్హం. పుష్ప రాజ్ పాత్ర ద్వారా అల్లు అర్జున్‌కు వచ్చిన క్రేజ్ ఇప్పుడు ఈ సినిమాకు ఈ స్థాయిలో రెస్పాన్స్ రావటానికి ఒక కారణం. అలాగే బాలీవుడ్ సినిమాల పట్ల ఉత్తరాది ప్రేక్షకులలో నెలకొన్న స్తబ్ధత మరో కారణం. .నిజానికి ఈ క్రేజ్ ఊహించనిదేమీ కాదు. చేతిలో చిల్లిగవ్వ లేని దశనుంచి వ్యవస్థను శాసించే స్థాయికి ఎదిగే పాత్ర పుష్ప రాజ్ . సహజంగా ఇలాంటి రోల్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకునే హీరోయిక్ అండ్ ఎమోషనల్ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. సగటు సినిమా అభిమాని కోరుకునేది ఇదే. ఇలాంటి పాత్రలు..సినిమాలు ఇప్పుడు బాలీవుడ్ లో కరువయ్యాయి. వాటి కోసం ప్రేక్షలు మొహం వాచిపోయి ఉన్నారు. ఈ గ్యాప్ ని దక్షిణాది సినిమా బర్తీ చేస్తోంది. అందుకే భాషా బేధం లేకుండా ఉత్తరాది వారు కూడా వాటిని ఆదరిస్తున్నారు. టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ వంటి మాస్ హీరోలు యాక్షన్, రొమాన్స్‌తో అలరించినా .. వారి పాత్రల్లో సగటు భారతీయ సినిమా హీరో పడే కష్టాలు, కన్నీళ్లు కనిపించవు. దీనికి భిన్న ంగా పుష్పలో అల్లు అర్జున్, కేజీఎఫ్ లో యష్ ధరించిన పాత్రలను చూడవచ్చు. వారు ప్రేక్షకుడిని సరిగ్గా ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టారు. ఆయా పాత్రలు రోజువారీ ప్రేక్షకులు తమను తాము చూసుకునేలా ఉంటాయి. పుష్ప: ది రైజ్‌లో, అల్లు అర్జున్ సెల్ఫ్ మేడ్ క్యారెక్టర్ అటువంటిదే. అతని అక్రమార్జన, తిరుగుబాటు వైఖరి, లోతైన భావోద్వేగం 'రాగ్స్ టు రిచ్' ఫార్ములాకు తిరిగి జీవం పోసాయి. పుష్ప 2 దీనిని నెక్ట్స్ లెవెల్‌కు తీసుకువెళుతుందని హామీ ఇచ్చింది.

# రిజర్వేషన్ల కాలపరిమితిలో మార్పుకు సన్నద్ధం

హైదరాబాద్,తెలంగాణలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగరా మోగనుంది. అయితే అది బీసీ కులగణన తర్వాతే. అందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో 12,992 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్ కాల పరిమితి ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ పాలనలో పంచాయతీలు నడుస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంచుతామని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీ ఇవ్వడంతో అందుకు తగ్గట్టుగా ఇప్పుడు బీసీ కుల గణన జరుగుతోంది. ఈ సర్వే తర్వాత బీసీ జనాభా దామాష పద్దతిన పంచాయతీలు బీసీలకు రిజర్వే చేయనున్నారు. అయితే ఇందు కోసం పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులు చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా వచ్చే శాసనసభ సమావేశాల్లో పంచాయతీ రాజ్ బిల్లులో సవరణలు చేయనున్నారు. కేవలం బీసీ రిజర్వేషన్ల కోసమే కాకుండా మరి కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని పంచాయతీ రాజ శాఖ అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ సర్కార్ హాయంలో అంటే 2018లో పంచాయతీ రాజ్ బిల్లు తీసుకువచ్చింది. అందులో పదేళ్ల కోమారు అంటే రెండు టర్మ్‌ల తర్వాతే రిజర్వేషన్ల మార్పుపై నిర్ణయం తీసుకునేలా చట్టంలో పేర్కొంది. అంతకు మునుపు ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్లు మార్పు ఉండేది. కాని కేసీఆర్ హాయంలో దాన్ని పదేళ్లకు చేసింది. ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్ల మార్పు వల్ల ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని, అభివృద్ధి కుంటుపడుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ సర్కార్ దీన్ని ఐదేళ్లకు కుదించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు బిల్లులో మార్పులు తెచ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ సిద్ధమవుతోంది. ప్రస్తుత పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు ఉంది. అయితే సర్పంచ్‌లు ప్రజల చేత ఎన్నుకోబడిన వారు. వారిని తొలగించే అధికారం కలెక్టర్లకు కట్టబెట్టడంపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సర్పంచ్‌లు దీన్ని వ్యతిరేకించారు. ప్రజా ప్రతినిధులు ఈ అధికారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు రేవంత్ సర్కార్ సానుకూలంగా స్పందించింది. వచ్చే బిల్లులో ఈ మేరకు కలెక్టర్ అధికారాలకు కోత పడనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ కట్టబెట్టింది. దీంతో పంచాయతీలో సర్పంచ్ ఏ పని చేయాలన్నా ఉప సర్పంచి సంతకం పెడితేనే నిధులు విడుదల అయ్యే పరిస్థితి. దీంతో చాలా పంచాయతీల్లో సర్పంచ్ ఓ పార్టీ వ్యక్తి అయితే, ఉప సర్పంచ్ మరో పార్టీ వ్యక్తి ఎన్నికవడం జరిగింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ ఆ పంచాయతీ అభివృద్ధి కుంటుపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే అప్పటి ప్రభుత్వం ఉపసర్పంచ్‌కు చెక్ పవర్ ఇవ్వడం ద్వారా సర్పంచ్ అవినీతికి పాల్పడకుండా ఉంటారన్న ఉద్దేశాన్ని వెలిబుచ్చింది. అయితే దీనిపై సర్పంచ్లు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. సర్పంచ్‌తో సమానంగా ఉప సర్పంచ్‌కు చెక్ పవర్ ఇస్తే తమ పదవికి విలువ ఏంటని పార్టీ వేదికలపైన ప్రశ్నించిన సందర్భాలున్నాయి. వచ్చే బిల్లులో ఉప సర్పంచ్లకు చెక్ పవర్ రద్దు చేసే దిశగా పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులున్నాయి. ఉప సర్పంచ్‌కు బదులు పంచాయతీ కార్యదర్శికి ఆ అధికారం ఇచ్చే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలి.

# మేడారంలో ప్రకృతి ప్రకోపం

హైదరాబాద్, పచ్చని తాడ్వాయిపై ప్రకృతి కన్నెర్ర చేసినట్లు ఉంది. సుమారు లక్ష చెట్లు కూలిన .. 95 రోజుల్లోనే.. ఆ ప్రాంతం మళ్లీ ప్రకృతి ప్రకోపానికి గురైంది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన వచ్చిన వర్షం, ఈదురుగాలులతో.. మేడారం అడవుల్లో సుమారు 85 వేల చెట్లు కూలాయి. దాంట్లో భారీ వృక్షాలు ఉన్నాయి. సుమారు 50 నుంచి వంద ఏండ్ల నాటి మహావృక్షాలు కూడా ఆ నాటి ప్రకృతి ప్రకోపానికి నేలరాలాయి. అయితే ఇవాళ ఆ ప్రాంతమే కేంద్రంగా భూకంపం సంభవించింది. ములుగు జిల్లాలోని మేడారం కేంద్రంగా 5.3 తీవ్రతతో భూమి కంపించింది. భూమిలో సుమారు 40 కిలోమీటర్ల లోతులో భూకంప తీవ్రత నమోదు అయ్యింది. తాడ్వాయి అడవుల్లో ఆగస్టు 31న జరిగిన ప్రకృతి బీభత్సం కారణంగా రూ.152.64 కోట్ల నష్టం వాటిల్లిందని అటవీ అధికారులు ఇటీవల అంచనా వేశారు. ఆ నాటి భారీ వర్షానికి బలమైన గాలులు తోడు కావడంతో తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లోని అడవులకు తీవ్ర నష్టం కలిగింది. 332.02 హెక్టార్లలో 85,125 చెట్లు కూలిపోవడమో, విరిగిపోవడమో జరిగిందని అధికారులు డ్రోన్ ఫోటోలు, వీడియోల ద్వారా అంచనా వేశారు. ములుగు జిల్లాలో జరిగిన ప్రకృతి విపత్తుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 11వ తేదీన తన ట్విట్టర్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. సుమారు లక్షకుపైగా చెట్లు మేడారం అడవుల్లో కూలాయని, వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆ ట్వీట్‌లో ఆయన తెలిపారు. ప్రకృతి విపత్తులను అడ్డుకోవాలంటే కలిసికట్టుగా పర్యావరణ సంరక్షణ చేపట్టాలని ఆయన ఆ ట్వీట్‌లో కోరారు. గోదావరి నది సమీపంలో ఉన్న ఈ అటవీ ప్రాంతంపై ప్రకృతి ప్రభావం ఎలా ఉందో శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతానికి సమీపంలోనే బొగ్గు గనులు కూడా ఉన్నాయి. దీంతో భూగర్భ నిపుణులు ఈ ప్రాంత సెసిమిక్ యాక్టివిటీపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# పేరుకు జపం..

హైదరాబాద్,భక్తి దేవుడిపై కాదు.. ప్రసాదం మీద అన్నట్లుగా ఆర్. కృష్ణయ్య తీరు ఉంటుంది. బీసీలకు తానే నాయకుడినని చెప్పుకుంటూ ఆ పేరుతో అధికారంలో ఉన్న పార్టీల పంచన చేరి బడా పదవులు కట్టేస్తుంటారు. స్వల్ప వ్యవధిలోనే దాదాపు అన్ని పార్టీలనూ చుట్టేశారు. ఏ పార్టీలోకి వెళ్లినా బడా పదవులు దక్కించుకోవటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. పార్టీల అధిష్టానాలు సైతం ఆయనకు పదవి ఇస్తే బీసీల సమస్యలను పరిష్కరించినట్లేనని భావిస్తాయి. కానీ, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి మెజార్టీ బీసీలు దూరమైనట్లే. ఈ విషయం అనేక సార్లు రుజువైంది. కానీ, ఆయన మాత్రం బీసీలంతా తన వెంటే.. తన వైపే అంటూ ఇప్పటికీ రాజకీయ పార్టీలను నమ్మించి పెద్ద పెద్ద పదవులను తన ఖాతాలో వేయించేసుకుంటారు. తాజాగా మరోసారి రాజ్యసభకు వెళ్లేందుకు ఆయన సిద్ధమవుతున్నారు.. ఈ సారి మరో కొత్త పార్టీ నుంచి. ఇంతకీ ఆయన ఎవరని తెగ ఆలోచిస్తున్నారా.. అంత అవసరం లేదు.. తెలుగు రాష్ట్రాల్లో ఆయన పేరు అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితమే. ఆయనే రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ . కృష్ణయ్య. మొన్నటి వరకు వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన కృష్ణయ్య. ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. ప్రస్తుతం బీజేపీ కండువా కప్పుకొని ఆ పార్టీ నుంచి మరోసారి రాజ్యసభకు వెళ్లేందుకు రెడీ అయిపోయారు. అయితే బీసీ నాయకుడి హోదాలో ఆర్. కృష్ణయ్య బడా పదవులు దక్కించుకుంటున్నప్పటికీ.. బీసీ వర్గాలకు, ఆయనకు పదవి ఇచ్చి గౌరవించిన పార్టీలకు ఇసుమంతైనా మేలు చేకూర్చలేక పోతున్నారు సరికదా, పదవులిచ్చిన పార్టీలకు ఆయన వల్ల తేరుకోలేని నష్టం వాటిల్లుతోంది. ఆర్.కృష్ణయ్యకు పెద్ద పీట వేసిన వెంటనే ఆయా పార్టీలకు బీసీలు దూరం అవుతున్నారు. పాలిటిక్స్ లో ఇదో సెంటిమెంటుగా ధృవపడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆర్.కృష్ణయ్య ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి మెజార్టీ బీసీలు హ్యాడిచ్చేస్తారన్న చర్చ రాజకీయవర్గాలలో జోరుగా సాగుతోంది.ఏపీలో మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు మంగళవారం (డిసెంబర్ 3(నోటిఫికేషన్ విడుదలైంది. 10వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉంటుంది. వైసీపీకి చెందిన ముగ్గురు ఎంపీల రాజీనామాలతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. రాజీనామా చేసిన ముగ్గురు ఎంపీల్లో మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్‌రావు తెలుగుదేశంలో చేరారు. ఆర్.కృష్ణయ్య మాత్రం తాను ఏ పార్టీలోనూ చేరను, సొంత పార్టీ పెడతా అంటూ బీరాలు పలికినా.. బీజేపీ పెద్దలతో మాత్రం టచ్‌లో ఉన్నారు. ఆర్.కృష్ణయ్య రాజ్యసభ సభ్యుడిగా ఉండగానే రాజీనామా చేశారు. అదీ ఎన్నికలలో తాను ఏ పార్టీ తరఫునైతే ప్రాతినిథ్యం వహిస్తున్నారో ఆ వైసీపీ ఘోరంగా ఓడిపోయిన తరువాత రాజీనామా చేశారు. అదే సమయంలో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో బీజేపీ ముచ్చటగా మూడో సారి అధికార పగ్గాలు చేపట్టిన బీసీ నేతగా పేరున్న ఆర్. కృష్ణయ్య బీజేపీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఎందుకంటే ఆ పార్టీ నుంచి మరోసారి ఆయన రాజ్యసభకు వెళ్లేందుకు రూట్ క్లియర్ అయ్యింది కాబట్టి. ఏపీ నుంచి రాజ్యసభకు వెళ్లే వారిలో ఇద్దరు తెలుగుదేశం నుంచి నుంచి కాగా.. మరొకరు కూటమి కోటాలో బీజేపీ నుంచి వెళ్లనున్నారు. బీజేపీ నుంచి వెళ్లే రాజ్యసభ సభ్యుడిగా ఆర్. కృష్ణయ్య పేరు ఖాయమైందని తెలుస్తోంది. ఆర్ కృష్ణయ్యకు పార్టీ తరపున రాజ్యసభకు పంపించడం ద్వారా తెలంగాణలోని బీసీలంతా బీజేపీవైపు వస్తారని కమలనాథుల అంచనా వేస్తున్నారు. అయితే, గతంలో ఆర్ కృష్ణయ్యకు పెద్దపీట వేసిన పార్టీలు కూడా ఇలానే ఆలోచించి చేతులు కాల్చుకున్నాయి. ప్రస్తుతం బీజేపీ ఆ జాబితాలో చేరేందుకు సిద్ధమైంది.2014 లో రాష్ట్ర విభజనకు ముందు వరకూ ఆర్.కృష్ణయ్య బీసీ సంఘం నేతగా కొనసాగారు. రాష్ట్ర విభజన తరువాత అనూహ్యంగా తెలంగాణ తెలుగుదేశంలో చేరారు. ఆ ఎన్నికల్లో ఎల్బీనగర్ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. 2018లో తెలంగాణలో జరిగిన ముందస్తు ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిన కృష్ణయ్య కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మిర్యాలగూడ నుండి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత కొద్ది కాలానికే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. 2 019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయన జగన్ తో సన్నిహిత సంబంధాలు ఏర్పర్చుకున్నారు. వైసీపీ తరపున రాజ్యసభకు ఎన్నికయ్యారు. వైసీపీ అధికారానికి దూరం కాగానే ఆ పార్టీకి, పదవికి ఆర్. కృష్ణయ్య రాజీనామా చేశారు. ప్రస్తుతం బీజేపీలో చేరి మరోసారి రాజ్యసభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక్కడ విశేషం ఏమిటంటే.. ఆర్. కృష్ణయ్య ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ అధికారంలోకి రాదన్న వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంటుంది. దీనికి కారణం లేకపోయలేదు. ఆయా పార్టీలు ఆర్. కృష్ణయ్య మన పార్టీలో ఉంటే బీసీలంతా మనవైపు ఉంటారన్న భ్రమల్లో ఉంటారు. కానీ, ఫలితం మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటూ వస్తోంది. ఊసరవెల్లి రంగులు మార్చడం కంటే వేగంగా కృష్ణయ్య పార్టీలు మార్చేస్తుండటం కూడా సహజంగానే బీసీలలో ఆయన పట్ల విశ్వాసం సన్నగిల్లేలా చేస్తున్నది. అందుకే ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న పార్టీకీ బీసీలు దూరం అవుతున్నారన్న వాదన కూడా ఉంది.

# బంగ్లా విపరీత ధోరణి...

సెంట్రల్ డెస్క్:బంగ్లాలో రాజకీయ తుఫాను చెలరేగి షేక్ హసీనా ప్రభుత్వం పతనమై వందరోజులు దాటింది. ఈ వంద రోజుల్లో భారత్‌తో సంబంధాలు అంతకంతకూ దిగజారుతున్న సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. మైనారిటీ హిందువులపై పెరుగుతున్న దాడులు ఈ పరిస్థితికి కారణమని చెప్పాలి. అంతర్జాతీయ కృష్ణచైతన్య సంస్థ బంగ్లాదేశ్ విభాగం మాజీ సభ్యుడైన చిన్మయకృష్ణ దాస్‌ను ఇటీవల రాజధాని ఢాకాలో దేశ ద్రోహం నేరం అరెస్టు చేయడం దీనికి పరాకాష్ఠ. మతోన్మాద శక్తులు హిందువులపై దాడులకు తెగబడుతుండటాన్ని ప్రశ్నిస్తున్న దాస్‌ను ప్రస్తుత బంగ్లా పాలకులు లక్ష్యంగా చేసుకున్నారు. తీవ్ర అభియోగాలతో ఆయనను జైల్లో పెట్టడమే కాకుండా న్యాయ సహాయం అందకుండా చేయడం ఆందోళన కలిగిస్తోంది.హిందువులతో సహా మైనారిటీలు అందరినీ కాపాడాల్సిన బాధ్యత తాత్కాలిక బంగ్లా ప్రభుత్వంపై ఉన్నదని భారత్ గుర్తుచేసింది. అయితే ఈ నిరసనలను, నివేదనలను బంగ్లాదేశ్ పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. నిజానికి అధికార మార్పిడికి దారితీసిన ఆగస్టు సంక్షోభ కాలంలోనే హిందువులపై వర్గీయులైన ప్రజలు అమానుషమైన దాడులకు తెగబడ్డారు. ఆ తర్వాత కూడా చెదురు మదురుగా దాడులు కొనసాగుతున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల గురించి భారత్‌లో పంపిణీ అవుతున్న రాజకీయ ప్రచారం తాత్కాలికంగా పాలకుడైన యూనుస్ కొట్టిపారేయడం.భారత్ అనుకూల నేతగా పేరున్న షేక్ హసీనాను గద్దె దించడంలో పాక్, చైనా అనుకూల శక్తులు కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ శక్తులే ఇప్పుడు సైన్యం వత్తాసుతో యూనుస్‌ను ముందు పెట్టుకొని తమ ఎజెండాను అమలుచేస్తున్నాయి. ఆ ఎజండాలో భారత వ్యతిరేక ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌పై యుద్ధం సాగించి మహోన్నత త్యాగాలు చేసిన భారత్‌కు ఇది బాధాకరమైన విషయమే. ప్రస్తుతం మన దేశంలో తల దాచుకున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను తనకు అప్పగించాలని యూనస్‌కు జారీచేస్తున్న తాఖీదులు హద్దులు మీరిన ప్రవర్తనగానే భావించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆయన ఎన్నికైన దేశాధినేత కాదు. అంతర్గత, విదేశీ వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే అధికారం ఆయనకు లేదనేది తెలుస్తుంది.బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వాలకు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించడం మినహా మరే పెద్ద బాధ్యతలు లేకపోవడం ఆచారంగా వస్తోంది. కానీ, యూనస్ ప్రభుత్వం అలాంటి ఉద్దేశమే తనకు లేనట్టుగానే వ్యవహరిస్తుండటం ప్రమాదకరం. నాలుగేండ్ల వరకు తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతుందని ఆయన విపరీత భాష్యాలు చెప్తున్నారు. గత మూడు



ఎన్నికలు (2014, 2018, 2024) అవకతవకలు, బహిష్కరణలతో విమర్శలను ఎదుర్కొన్నాయి.ఈ నేపథ్యంలో ప్రజలు ఇప్పుడు సజావుగా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో దేశ ఎదుర్కోవడంలో తాత్కాలిక ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రజలు ఎదుర్కొంటున్నారు. అల్లకల్లోలమై అరాచకానికి నెలవుగా మారిన బంగ్లాదేశ్‌లో శాంతి, సామరస్యాలను దాదాపుగా తిరిగి ఎన్నికలు నిర్వహించడం ఒక్కటే ప్రస్తుత సమస్యలకు పరిష్కారం. దేశ భవితవ్యాన్ని నిర్ణయించే బాధ్యతను ప్రజా ప్రభుత్వానికి అప్పగించి పక్కకు తప్పుకోవడమే తన కర్తవ్యమని యూనస్ ప్రభుత్వం గుర్తించాలి. ఈ అంతర్జాతీయ ఒత్తిడి అందించడానికి భారత్ దౌత్యపరంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం

తిరువనంతపురం,కేరళ రాష్ట్రం కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శబరిమల భక్తులతో వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. డజను మందికిపైగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 3:45 గంటల ప్రాంతంలో ఆర్యన్‌కావు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న లారీ.. బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన 40 అడుగుల లోతులోకి పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు సేలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో చిన్నారులు, వృద్ధులు సహా మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# బీజేపీ కమ్మేస్తోందా? కబళించేస్తోందా?




న్యూఢిల్లీ,కమల దళం రాను రానూ ఆ పార్టీ మౌలిక సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చేసి రాజకయ ప్రత్యర్థులను కబలించేయడం లక్ష్యంగా పెట్టుకుందా? రాష్ట్రాలలో అధికారం కోసం ఆ పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు, అమలు చేస్తున్న ఎత్తుగడలు చూస్తుంటే ఔనన్న సమాధానమే వస్తోంది. 2014 ఎన్నికలకు కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాన్ని ఇచ్చిన ఆ పార్టీ ఆ తరువాత సాగించిన ప్రస్థానాన్ని చూస్తుంటే దేశం మొత్తాన్ని కాషాయంతో నింపేయాలనీ, బీజేపీ జెండా యావద్దేశాన్ని కమ్మేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.జాతీయ స్థాయిలో కేంద్రంలో అధికారాన్ని దక్కించుకోవడంతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలలో కాషాయ జెండాయే ఎగరాలన్నది ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తున్నది. ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలనుకోవడాన్ని ఎవరూ తప్పు పట్టకు కానీ అందుకోసం విలువలకు పాతరేయడాన్ని, ప్రత్యర్థి పార్టీల ఉనికిని కూడా సహించలేని తత్వాన్ని మాత్రం ఎవరూ అంగీకరించజాలరు. కాంగ్రెస్ ఆత్మస్థైర్యం దెబ్బతినేలా చేయడంలో బీజేపీ ఇప్పటికే విజయం సాధించింది. ఏదో అప్పుడప్పుడు, అడపాదడపా ఒకటి రెండు ఎన్నికలలో విజయం సాధించడం వినా గత పదేళ్ల కాలంలో కాంగ్రెస్ కు దక్కిందేమీ లేదు. ఆ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టు నాగంభొట్టు అన్న చందంగా తయారౌతోంది. వారసత్వ రాజకీయాల పట్ల ప్రజలలో వైముఖ్యం, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, అధినాయకత్వం సీరియస్ రాజకీయాలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆ పార్టీ దేశ రాజకీయాలలో ఇప్పట్లో పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇటీవల జరిగిన హర్యానా,మహారాష్ట్ర ఎన్నికలో ఆ పార్టీ పెర్ఫార్మెన్స్ ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. వాస్తవానికి 1977 జనతా ప్రయోగం విఫలం అయిన తరువాత జనసంఘ్ పార్టీ తన రూపు మార్చుకుని రాజకీయాలలో బలంగా నిలదొక్కుకునేందుకు చేసిన ప్రయత్నం, 1980 దశకంలో ఆ పార్టీకి నేతలుగా వాజ్ పేయి, అద్వానీ వంటి వారి రాజకీయ సంకల్పం బీజేపీకి బలమైన పునాదులు వేశాయి. 1984 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ రికార్డ్ స్థాయిలో 400 మార్క్ అప్పట్లో బీజేపీ కేవలం రెండంటే రెండు స్థానాలతో లోక్ సభలో అడుగు పెట్టింది. అయితే 1989లో రామజన్మ భూమి నినాదంతో బీజేపీ పుంజుకుంది. ఆ ఎన్నికలలో 88 స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటింది.1990 సెప్టెంబర్ లో బీజేపీ నేత అద్వానీ అయోధ్యకు రథయాత్ర ప్రారంభించారు. యూపీఏ,బీహార్లలో రథయాత్ర జరుగుతున్నది. లాలూ బీహార్ సీఎంగా ఉన్నారు. ఆయన అద్వానీని అరెస్ట్ చేయడంతో రథయాత్ర ముగిసింది. దాంతో విపీసింగ్ ప్రభుత్వానికి బయట నుంచి ఇస్తున్న మద్దతును బీజేపీ ఉపసంహరించుకుంది. దీంతో వీపీసింగ్ ప్రభుత్వం కుప్పకూలి, కాంగ్రెస్ మద్దతుతో చరణ్ సింగ్ ప్రభుత్వం కొలువుదీరింది. అయితే అదీ మూన్నాళ్ల ముచ్చటగానే ముగిసింది. చరణ్ సింగ్ కు ఇచ్చినట్లే ఇచ్చిన మద్దతును కాంగ్రెస్ ఉపసంహరించుకోవడంతో 1991లో మధ్యంతర ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఆ ఎన్నికలు తొలి దశ పూర్తై మలి దశ జరగడానికి ముందు రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురయ్యారు. ఆ సానుభూతి పవనాలు బలంగా వీచినా కూడా ఈ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ నిలిచినా సాధారణ మెజార్టీ రాలేదు. బీజేపీ బలం 88 నుంచి 120 స్థానాలకు పెరిగింది. పూర్తి మేజార్టీ లేకపోయినా పీవీ నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆర్థిక మంత్రిగా పీవీ నరసింహరావు తీసుకున్న నిర్ణయాలు, ఆయన తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశాన్ని గాడిలో పెట్టాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి దేశం బయటపడింది. మైనారిటీ ప్రభుత్వాన్ని పీవీ నరసింహరావు విజయవంతంగా ఐదేళ్లూ నడిపారు.పీవీ హయాంలోనే 1992 లో యూపీలో బాబ్రీ మసీదును కరసేవకులు కూల్చివేశారు.దేశంలో అనేక విధ్వంసాలు చోటుచేసుకున్నాయి. బొంబాయి పేలుళ్లు కూడా ఆ సమయంలోనే జరిగాయి.1 996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. బాబ్రీ కూల్చివేత తో మైనార్టీలు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఓటు వేసారు. పార్టీ సోనియాగాంధీ సారథ్యంలోని వచ్చింది. హంగ్ పార్లమెంట్ ఏర్పడింది.కాంగ్రెస్ కు 140 సీట్లు వచ్చాయి.మొదటీ సారి కాంగ్రెస్ ఓటు షేర్ 30 శాతం కంటే తక్కువ వచ్చింది. వాజపేయి సారథ్యంలో బీజేపీ 161 స్థానాలు సాధించిన పార్టీగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే వాజ్ పేయి ప్రభుత్వం కేవలం 13 రోజులకే కుప్పకూలింది. తరువాత యునైటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. జనతాదళ్ కు చెందిన హెచ్ డి దేవెగౌడ ప్రధానమంత్రి అయ్యారు. ఆయన 1997 ఏప్రిల్ 21న రాజీనామా చేసారు.లాలూ దాణా కుంభకోణంలో చిక్కుకోవడంతో జనతాదళ్ నుంచి వీడి 17 మందితో రాష్ట్రీయ జనతాదళ్ ఏర్పాటు చేయడంతో గౌడ్ రాజీనామా చేసారు.1997 లో యునైటెడ్ ఫ్రంట్ నుంచే ఐకే గుజ్రాల్ ప్రధాని అయ్యారు. 11 నెలలు పరిపాలించారు.కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవడంతో గుజ్రాల్ ప్రభుత్వం పడిపోయింది. అస్థిరత కారణంగా 1998లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. బీజేపీ ఈ సారి 182 స్థానాలు సాధించి పెద్ద పార్టీ గా అవతరించింది. కాంగ్రెస్ కు 141 స్థానాలు వచ్చాయి.నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ పేరు తో బీజేపీతో కొన్ని పార్టీలు కూటమి కట్టాయి.12 స్థానాలున్న తెలుగుదేశం పార్టీ బయటినుంచి మద్దతు ప్రకటించింది.1994 డిసెంబర్లో ఉమ్మడి ఏపీ ఎన్నికల్లో 216294 స్థానాల్లో ఎన్టీఆర్ విజయం సాధించారు 1995లోఎన్టీఆర్ పార్టీలో తిరుగుబాటు జరిగి చంద్రబాబు సీఎం అయ్యారు. కేంద్రంలో వాజపేయి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం 13 నెలలు అధికారంలో ఉంది.ఏప్రిల్1999లో18 స్థానాలున్న అన్నాడిఎంకె అధినేత్రి జయలలిత తమిళనాడు లోని డిఎంకే ప్రభుత్వం బర్తరఫ్ చేయమని డిమాండ్ చేయడంతో వాజపేయి తిరస్కరించారు. దాంతో జయ మద్దతు ఉపసంహరించుకోవడంతో వాజపేయిపై అవిశ్వాసం ఒక్క ఓటు తేడాతో గెలిచి ప్రభుత్వం కూలిపోయింది.1999 సెప్టెంబర్-అక్టోబర్ లలో మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. 1999లో వాజపేయి నేతృత్వంలోని ఎన్డీఏ సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. ఏపీ సీఎం చంద్రబాబు ఎన్డీఏ కన్వీనర్ గా ఉన్నారు.ఐదేళ్లూ వాజపేయి ప్రధానిగా కొనసాగారు.1984 తరువాత మొదటి సారి ఐదేళ్లూ వాజపేయి ప్రభుత్వం అధికారంలో కొనసాగింది. 2004 నాటికి సోనియాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పుంజుకుంది. భారత్ వెలిగిపోతున్నదనే నినాదంతో వాజపేయి ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లి చతికిల పడింది. 2004లో కాంగ్రెస్ విజయం సాధించింది. విదేశీయురాలనే ఆరోపణతో ప్రతిపక్షాలు ఆమెను ప్రధాని అభ్యర్థిగా ఒప్పుకోమని పట్టుబట్టాయి.దాంతో పీవీ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా చేసిన మన్మోహన్ సింగ్ ను సోనియా గాంధీ ప్రధానిని చేసారు.ఆయన రెండు సార్లు ప్రధానిగా చేసినా రాజ్యసభ సభ్యుడిగానే కొనసాగారు.2014 ఎన్నికలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే విజయం సాధించడం ప్రధానిగా మోడీ అధికార పగ్గాలు చేపట్టడంతో బీజేపీ ప్రస్థానంలో స్పష్టమైన మార్పు మొదలైంది. మౌలిక సిద్ధాంతాలను పట్టుకుని వేలాడకుండా.. అధికారంలో కొనసాగడం కోసం ప్రత్యర్థి పార్టీలను బలహీనం చేయడం అన్న పంథాకు మోడీ పెద్ద పీట వేయడంతో ఆయన వరుసగా రెండు సార్లు బీజేపీని అధికారంలోకి తీసుకురాగలిగారు. ఆ రెండు సార్లూ కూడా మోడీది పేరుకు మాత్రమే సంకీర్ణ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అది బీజేపీ కాదు కాదు మోడీ సర్కార్ గానే మనుగడ సాగించింది. అందుకు మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా సొంతంగా ప్రభుత్వాన్ని నడిపే బలం ఏ రెండు సార్లూ కూడా బీజేపీకి దక్కడమే. ఇక 2024లో కూడా మోడీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ కొలువుదీరిగా.. ఈసారి బీజేపీకి జనం పూర్తి బలాన్ని ఇవ్వలేదు. దీంతో అనివార్యంగా సంకీర్ణ ధర్మాన్ని పాటించక తప్పని పరిస్థితుల్లో మోడీ పడ్డారు. అయితే మోడీ సర్కార్ వేస్తున్న అడుగులను నిశితంగా గమనిస్తే.. ప్రత్యర్థి పార్టీలనే కాదు, మిత్రపక్షాలను కూడా బలహీనం చేయడమనే వ్యూహాన్ని బీజేపీ అనుసరిస్తోందని చెప్పక తప్పదు. ముందు ముందు రోజులలో బీజేపీ మిత్రపక్షాలలో చీలికలు అనివార్యమని మహారాష్ట్రను ఉదాహరణగా చూపుతూ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# ఢిల్లీలో మెరుగుపడుతున్న గాలిలో నాణ్యత

న్యూఢిల్లీ, గత కొన్ని రోజులుగా తీవ్ర వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయిన ఢిల్లీ వాసులకు కాస్త ఉపశమనం లభించింది. రాజధాని ప్రాంతంలో బుధవారం గాలి నాణ్యత కాస్త మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 211గా నమోదైంది. దీన్ని మోడరేట్ కేటగిరీ కింద సూచిస్తారు. కాగా, 20 రోజుల క్రితం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 మార్క్‌ను తాకి ప్రమాదకర స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఈ వారం మరింత తగ్గుముఖం పట్టింది. ఆదివారం 285, సోమవారం 273గా నమోదైన ఏక్యూఐ లెవల్స్.. మంగళవారం 268 వద్ద నిలిచిన విషయం తెలిసిందే. ఇవాళ ఇంకాస్త మెరుగుపడటంతో రాజధాని వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు ఢిల్లీలో ఇవాళ కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సీజన్ సగటు కంటే 2.5 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ ఉదయం 8:30 గంటల సమయంలో ఢిల్లీలో తేమ స్థాయి 68 శాతంగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

# ఇక పిల్లాడికి పెళ్లవుతుందా? మారుతున్న అమ్మాయిల ఆలోచనలు

ఎనబయ్యో దశకం వరకు మగపిల్లలకి పెళ్లి కావాలంటే కనీసం ప్రభుత్వ ఉద్యోగమో, టీచరు లేదా బ్యాంక్ జాబో ఉండాల్సిన పరిస్థితి. దాంతో పాటూ అబ్బాయిల వైపు నుంచి కట్నకానుకల డిమాండ్స్ ఎలాగూ ఉంటాయి. అదే తొంబైల తర్వాత గాలి అమెరికా వైపుకు వీయడం మొదలు పెట్టింది. అమ్మాయిల ఆలోచనల్లో ఇండియాలోనే ఉండే పెద్ద ఉద్యోగం వాడికంటే అమెరికా భర్త అయితే బాగుంటుందని కోరుకోవడం ఎక్కువయ్యింది. దాంతో ఎన్నారై మ్యాచ్‌లకు గిరాకీ పెరిగింది. కట్నాలు కూడా దానికి తగ్గట్టే ఉండేవి. క్రమంగా రోజులు మారుతూ వచ్చాయి. గల్లీకొ పిల్లడు అమెరికాలో ఉండడం వల్ల, కేవలం ఎన్నారై స్టాటస్ కాకుండా, అబ్బాయికి ఆస్తిపాస్తులుం టేనే పెళ్లికి రెడీ అంటున్నారు అమ్మాయిలు. అబ్బాయిల సంఖ్య పెరిగి, అమ్మాయిల సంఖ్య తగ్గడంతో కట్నాల డిమాండ్స్ కూడా తగ్గుతూ వచ్చాయి. 'మంచి అమ్మాయి దొరికితే చాలు.. కట్నాలక్కర్లేద'నే రోజులు వచ్చాయి. దాంతో అమ్మాయిలకే డిమాండ్ పెరిగింది. కట్నాలు డిమాండ్ చేసే అబ్బాయిలు తగ్గారు. తెలియని వాళ్లకి ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ, అబ్బాయిల పెళ్లిళ్ల కోసం వధువుని వెతుక్కుంటూ మ్యాట్రిమోనీ సైట్లల్లో తొంగిచూసే తల్లిదండ్రు లకి కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. తమ కొడుకు అమెరికాలో హెచ్ 1 బి మీద ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడని చెబితే చాలు అమ్మాయిలు క్యూ కడతారు అనుకునే వాళ్లకి చుక్కెదురవుతోం ది. కేవలం అమెరికా ఉద్యోగం సరిపోదంటున్నారు అమ్మాయిలు. ఫ్యామిలీ ఫైనాన్షియల్ స్టాటస్ లోనూ, చదువులోనూ, అందచందాల్లోనూ జస్ట్ యావరేజ్ అనిపించే అమ్మాయిలు అమెరికాలోనూ, ఇండియాలోనూ సొంత ఇళ్లు ఉండాలంటున్నారు. లేదా కనీసంలో కనీసం 10-15 ఎకరాల పొలమైనా ఉండాలట. ఈ తరహా అమ్మాయిల తల్లిదండ్రుల్లో చాలామందికి సొంత ఫ్లాట్ కూడా ఉండట్లేదన్నది ఇక్కడ కఠిన వాస్తవం. అబ్బాయిల తల్లిదండ్రులు నచ్చిన సంబంధం కోసం ఒక ఏడాది కాలయాపన చేసి వెనక్కి వచ్చి చూస్తే ఈ రకం అమ్మాయిల్లో సగం మందికి పెళ్లిళ్లు కుదిరిపోతున్నాయి. అంటే వాళ్లకి కావాల్సిన వరులు దొరికేస్తున్నారని అనుకోవాలి.ఇక కొద్దో గొప్పో ఆస్తి ఉండి, అందచందాలు కూడా ఉంటే ఇక ఆ అమ్మాయిల కోరికలు అన్నీ ఇన్నీ కావు. పదుల కోట్లల్లో ఆస్తులు, విల్లాలు, అమెరికాలో టాప్ యూనివెర్సిటీ బ్యాక్ గ్రౌండ్ ఉండి టాప్ లెవెల్లో జాబ్ ఉన్న అబ్బాయిలు మాత్రమే కాకుండా, కచ్చితంగా గ్రీన్ కార్డ్ వాళ్లు కావాలని కోరుకుంటున్నారు. ఆ రేంజ్ అబ్బాయిలు కూడా ఇలాంటి వాళ్ల కోసం వెతుక్కుని వచ్చి పోటీ పడి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. లవ్ మ్యారేజీలైతే ఓకే కానీ, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలంటే ఆ పెద్దలకి చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక ఇప్పుడు పరిస్థితి మరీ కఠినంగా మారుతోంది. ట్రంప్ ప్రమాణస్వీకారం తర్వాత అమెరికాలో సీన్ మారుతోంది. హెచ్ 1 బి శాశ్వతంగా ఎత్తేస్తున్నాడని టాక్. అలాగే టాప్ యూనివర్సిటీల్లో సీట్ పొంది మెరిట్లో పాసైన విద్యార్థులకి మాత్రం సత్వరం గ్రీన్ కార్డ్ ఇచ్చేస్తానంటున్నాడు. అంటే వాళ్లకి తప్ప ఎ-క్లాస్ అమ్మాయిలు దొరికే పరిస్థితి ఉండదు ఇండియన్ మ్యారేజ్ మార్కెట్లో. క ఇందాక చెప్పుకున్న యావరేజ్ అమ్మాయిల పరిస్థితి కూడా మారనుంది. వాళ్ల కోరికలు తగ్గించుకోవాల్సిన పరిస్థితి రాబోతోంది. ఎన్నారై సంబంధాలే కావాలంటే కుదరదు. ఎందుకంటే హెచ్ 1 బి లేకపోతే ఎన్నారై పెళ్లికొడుకులే తగ్గిపోతారు కాబట్టి. ఉన్నంతలో ఇండియాలోనే పెద్ద ఉద్యోగం, మంచి సంపాదన ఉన్నవాళ్లని వెతుక్కోవచ్చు. అమ్మాయిల్లో ఈ కాంప్రమైజ్ వల్ల అబ్బాయిలకి పెళ్ళిళ్లు ఈజీగా అవుతాయా అంటే చెప్పలేం. ఎందుకంటే మారిన సినారియోలో ఇండియాలో నిరుద్యోగులు పెరిగే అవకాశాలున్నాయి. కొద్దో గొప్పో ఉద్యోగాలుంటేనే పరిస్థితి కష్టంగా ఉంటే, ఇక ఉద్యోగం లేని అబ్బాయిల్ని చేసుకునేదెవరు? ఆస్తులుంటే కాస్త పర్వాలేదనుకోవాలి. అందుకే ఈ పరిస్థితిని దాటాలంటే అమెరికాని వదిలేసి మరో దేశాన్ని వెతుక్కోవాలేమో భారతీయ యువకులు. అలా అనుకుందామనుకున్నా అమెరికా తర్వాత డిమాండ్ ఉన్న దేశం కెనెడా. అక్కడ జాబ్ మార్కెట్ అమెరికా అంత స్ట్రాంగ్ కాదు. ఆ తర్వాత యూకే. అది ఆల్రెడీ ఇబ్బందుల్లో ఉంది. అసలక్కడ చదివిన ఏ భారతీయుడైనా తిరిగి ఇంటికొస్తున్నాడే తప్ప అక్కడ జాబ్ పొందడం చాలా కష్టంగా ఉంది. ఇక మిగిలింది ఆస్ట్రేలియా. అక్కడ కూడా జాబ్ వీసాలు కఠినమయ్యాయి. మరి ఎప్పటికప్పుడు పెరిగిపోతున్న భారతీయ యువ జనాభాకి ప్రపంచంలో మంచి చోటెక్కడ అనేది ప్రశ్న. దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 60,301 మంది భక్తులు దర్శించుకోగా 20,222 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.32 ఆదాయం వచ్చిందన్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం అమ్మవారు గోవర్ధనగిరిధారియైన శ్రీ కృష్ణుని అలంకారంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు.

# 80 శాతం పైగా జనరల్ కేటగిరీ ప్రొఫెసర్లే




న్యూఢిల్లీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల అధ్యాపకులలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు చాలా తక్కువ శాతం ఉన్నారు. వీటిల్లో దాదాపు 80 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందిన అధ్యాపకులే బోధిస్తున్నారని ఆర్‌టిఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ - సమాచార హక్కు) ద్వారా వెల్లడైంది. రెండు ఐఐటిలు, మూడు ఐఐఎంల్లో అయితే జనరల్ కేటగిరీ వాటా 90శాతానికి మించిపోయింది. మరో ఆరు ఐఐటిల్లో, నాలుగు ఐఐఎంల్లో జనరల్ వాటా 80-90 శాతం మధ్య వుందని సమాచార హక్కు ద్వారా అందిన సమాచారం తెలియజేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఐటి, ఐఐఎంల సంస్థల నుంచి తీసుకున్న సమాచారం మేరకు ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఐఐటి, ఐఐఎంల తోపాటు ఇతర విద్యా సంస్థల్లో అధ్యాపకుల పోస్టుల కోసం కేంద్రం రిజర్వేషన్లను కల్పించింది. ఓబిసిలకు 27 శాతం, ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లు ఇచ్చారు. వెనుకబడిన తరగతుల వారికి కేంద్రం అవకాశాలు కల్పించినా ఆచరణలో అవి అమలు కావడం లేదు. ఇండోర్ ఐఐఎంలో 109 పోస్టుల్లో 106 పోస్టులు జనరల్ కేటగిరీలోని వారితోనే నడుస్తున్నాయి. ఈ ఐఐఎంలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన అధ్యాపకులే లేరని ఆర్‌టిఐ తెలిపింది. ఇక ఉదరుపూర్‌లో కూడా 90 శాతానికి పైగానే, ఐఐఎం లక్నోలో కూడా 95 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందినవారే అధ్యాపకులుగా ఉన్నారు. ఆరు ఐఐఎంలను పరిశీలించినట్లైతే ఒక్క ఎస్‌టి కేటగిరికి చెందిన అధ్యాపకులు కూడా లేరు. బెంగళూరు ఐఐఎంలో 85 శాతానికిపైగా జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. అందుకే రిజర్వేషన్లకు తగ్గట్టుగా అధ్యాపకుల్ని నియమించాలని అక్కడ నిరసనలు జరిగాయి. ఐటి ముంబయి, ఐఐటి ఖరగ్‌పూర్‌లలో 700కి పైగా అధ్యాపక పోస్టుల్లో 90 శాతం పదవుల్లో జనరల్ కేటగిరిగికి చెందిన వ్యక్తులే ఉన్నారు. మండీ, గాంధీనగర్, కాన్పూర్, గౌహతి, ఢిల్లీ ఐఐటిల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 80-90 శాతం మేర జనరల్ కేటగిరీ వారే అధ్యాపకులుగా ఇక్కడ ఉన్నారు. మొత్తంగా 13 ఐఐఎంల్లో 82.8 శాతం మంది అధ్యాపకులు జనరల్ కేటగిరీ వారు వుండగా, కేవలం 5 శాతం ఎస్‌సి, ఒక శాతం ఎస్‌టి, 9.6 శాతం మంది ఓబిసి, ఆర్థికంగా బలహీనపడిన వర్గాలు (ఇబిసి), వికలాంగుల కోటాలకు చెందినవారు అధ్యాపకులుగా ఉన్నారు. 1 ఐఐటిలో 80 శాతం జనరల్ కేటగిరీ, 6 శాతం ఎస్‌సి, 1.6 శాతం ఎస్‌టి, 11.2 శాతం ఓబిసి, ఇబిసి, వికాలాంగుల కోటాలకు చెందిన అధ్యాపకులు ఉన్నారు. మొత్తంగా ఐఐటిల్లో గానీ, ఐఐఎంల్లో గానీ ఇంచుమించుగా ఇదే గణాంకాలు ఉన్నాయి.దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎంలన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొందని కూడా చెప్పలేమని ఆర్‌టిఐ పేర్కొంది. పాట్నా ఐఐటి అధ్యాపకుల్లో 38 శాతం ఓబిసి, ఎస్సీలు 22 శాతం, ఎస్‌టిలు 13 శాతం, జనరల్ కేటగిరీ 12 శాతం మందే ఉన్నారు. భిలారు, ఇండోర్ ఐఐటిల్లో 50 శాతం మంది జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. జమ్మూలో 51 శాతం జనరల్ కేటగిరీ, 19 శాతం ఎస్‌సి, 5 శాతం ఎస్‌టి, 23 శాతం ఓబిసి, 2 శాతం ఇతర కేటగిరీలకు చెందిన వారు అధ్యాపకులుగా ఉన్నారు. ఏడు ఐఐఎంల్లో 256 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్‌టిఐ డేటా తెలిపింది. ఈ పోస్టుల్లో ఓబిసి కేటగిరీకి చెందినవి 88, 54 ఎస్‌సి, 30 ఎస్‌టి కేటగిరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఐఐటిల్లో 1,557 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 451 ఓబిసి, 234 ఎస్‌సి,, 129 ఎస్‌టి పోస్టులు ఉన్నాయని ఆర్‌టిఐ తెలిపింది.

# హైదరాబాద్‌లో దేశంలోని మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్

హైదరాబాద్,ఇప్పటికీ భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్ లో నిర్మిస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 3వ తేదీన జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్‌క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు విషయాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ఈ కేంద్రం కోసం, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి. గూగుల్ కంపెనీతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌లో దేశంలోని మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ (GSEC)ని నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో స్థాపించనున్న సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే ఐదవది. ఏషియా పసిఫిక్ జోన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో కేంద్రం ఇదే.గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ (GSEC) ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత మరియు ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా ఉపయోగపడుతుంది. దేశంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేస్తుంది.ఇప్పటికీ భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్ లో నిర్మిస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 3వ తేదీన జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్‌క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు విషయాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ఈ కేంద్రం కోసం, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అమెరికాలో పర్యటించిన సందర్భంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సైతం సందర్శించారు. అప్పటి నుంచి హైదరాబాద్ నగరంలో ఈ అత్యాధునిక కేంద్రం ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం



ప్రత్యేక చొరవ చూపింది.హైదరాబాద్‌లో ఈ సేఫ్టీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్య ఒప్పందం చేసుకోవటంతో మరోసారి హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటీ ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తుందని చెప్పారు. గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ అధ్వర్యంలోని కంపెనీ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన జూబ్లీహిల్స్ నివాసంలో బుధవారం కలిసింది. ఈ సమావేశంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన ఐదు టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంగా పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యోల ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

# 'సీజ్ ద షిప్' -తరువాత ఏం జరిగింది? సీజ్ అయిందా?

అమరావతి,ఏపీ డిప్యూటీ సీఎం పవర్ స్టార్ సినిమాటిక్ డైలాగ్ 'సీజ్ ద షిప్..' తెలుగు నాట ఐదు రోజులుగా హల్ చల్ చేస్తోంది. కాకినాడ యాంకరేజీ పోర్టులో బియ్యం తరలింపు కోసం సిద్ధమైన పనామా దేశానికి చెందిన 'స్టెల్లా ఎల్' అనే షిప్‌ను సీజ్ చేయాలంటూ ఉపముఖ్యమంత్రి ఆదేశించిన తర్వాత 'సీజ్ ద షిప్' అనే మాట ట్రెండ్ అయ్యింది. అయితే, స్వయంగా ఉప ముఖ్యమంత్రి ఆదేశించి నప్పటికీ అధికారులు ఆ షిప్‌ను ఇంకా ఎందుకు సీజ్ చేయలేదు? మరో దేశానికి చెందిన షిప్‌ను సీజ్ చేసే అధికారం రాష్ట్ర అధికారులకు ఉంటుందా? తనకు సంబంధం లేని శాఖలో పవన్ జోక్యం చేసుకున్నారా? అసలు అలా పోర్టులోని నౌకలో తనిఖీలు చేసే అధికారం మంత్రులకు, ప్రజాప్రతినిధులకు ఉంటుందా? కాకినాడ పోర్టును స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చేశారు . ఇక్కడి నుంచి ఇంత భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? తీరప్రాంతంలో అక్రమ రవాణాను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైతే దేశ భద్రతకే ముప్పుగా మారుతుంది. భవిష్యత్తులో పేలుడు పదార్థాలు, మత్తు పదార్థాలు అక్రమంగా దేశంలోకి రావని గ్యారంటీ ఏంటి?' అని అధికారులను ప్రశ్నించిన పవన్ కల్యాణ్.. 'సీజ్ ద షిప్' అని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఆ షిప్‌ను సీజ్ చేయడంతో పాటు, ఈ బియ్యం రవాణా వెనుక ఎవరున్నారో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే పవన్ అదేశించినట్టుగా ఏమీ జరగలేదు. ఆయన పర్యటన తర్వాత అధికారులు మిన్నకుండిపోయారు. ఏం చేయాలో తెలియకో లేక నిబంధనల వల్లనో, ఇంకేదైనా కారణం వల్లనో ఏమో గానీ.. షిప్‌ను సీజ్ చేయడం మాట అటుంచి ఆ రేషన్ బియ్యాన్ని కూడా సీజ్ చేయలేకపోయారు. 'ఇంకా షిప్ సీజ్ చేయలేదు. అందులో పీడీఎస్ బియ్యం పట్టుబడటంతో పౌర సరఫరాల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. కస్టమ్స్ అధికారులతో మాట్లాడుతున్నారు. ఇది కస్టమ్స్ నోట్గి÷డ్ పోర్టు కాబట్టి వాళ్లే నిర్ణయం తీసుకోవాలి' అని కాకినాడ పోర్టు అధికారి ఒకరు తెలిపారు. ఐతే, తీరంలోకి వచ్చి.. ఇక్కడి నిబంధనలను అతిక్రమించిన ఏ షిప్‌నైనా సీజ్ చేసే అధికారం మన పోర్టు అధికారులకు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అధీనంలోని పోర్టులకు, స్టేట్ పోర్టులకు పోర్టు ఆఫీసర్ బాధ్యులుగా ఉంటారు. కేంద్రం పరిధిలోని పోర్టులకు హార్బర్ మాస్టర్ ఉంటారు. ఇండియన్ పోర్ట్స్1908 యాక్ట్ ప్రకారం.. నిబంధనలకు విరుద్ధంగా ఎగుమతులు చేసే ఏ దేశపు షిప్‌నైనా సీజ్ చేసే అధికారం వారికి ఉంటుంది. ఎందుకంటే ఆ షిప్ మన తీరంలో ఉంది కాబట్టి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాహనం తెలంగాణలో ప్రమాదానికి కారణమైతే ఎలా కేసు నమోదు చేస్తారో ఇది కూడా అంతే. వాస్తవానికి స్టేట్ పరిధిలోని పోర్టు కాబట్టి మంత్రిగా పవన్ కల్యాణ్ పరిశీలించాలని భావిస్తే ముందస్తు సమాచా రం ఇవ్వాలి. ప్రయర్ నోటీసు ఇవ్వకుండా అలా తనిఖీలు చేసే అధికారం ఎవరికీ లేదు. ఏ పోర్టులోకి అయినా సరే నోటీసు ఇవ్వకుండా వెళ్లడానికి వీల్లేదు. రైట్ ఆఫ్ అడ్మిషన్ అనేది సాధారణంగా ఇస్తారు. కానీ ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఐతే, బియ్యం స్మగ్లింగ్ కిందకు రాదు, ఎగుమతుల కిందకే వస్తుంది. ప్రభుత్వ అనుమతి వచ్చే వరకూ ఆ షిప్‌ను పంపొద్దు. కాగా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం



మధ్యాహ్నం భేటీ అయిన తర్వాత ప్రభుత్వం నుంచి ఓ ప్రకటన వెలువడింది.కాకినాడ పోర్టుకు ఐపీఎస్ కేడర్ స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను నియమించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్య కుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సోమవారం జరిగిన సమీక్షలో నిర్ణయించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. పోర్టులో ఉన్న ఆ షిప్‌ను ప్రభుత్వం అనుమతి వచ్చే వరకు పంపొద్దని ఆదేశాలిచ్చినట్టు స్పష్టం చేసింది. 019లో వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కాకినాడ పోర్టులో 41.12 శాతం వాటాను అరబిందో సంస్థకు కట్టబెట్టారని, ఆ తర్వాతే అక్కడి నుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతులు భారీగా పెరిగాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలోని చివరి మూడేళ్లలో కాకినాడ పోర్టు నుంచి రూ.48,537 కోట్ల విలువైన బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేశారని మంత్రి చెప్పారు. 'కాకినాడ పోర్టు మీదే కూటమి ప్రభుత్వం ఎందుకు దృష్టిపెట్టిందని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. దానికి కారణం ఉంది. గత ఐదేళ్లలో కాకినాడ పోర్టులోకి ఎవరినీ అనుమతించలేదు. అక్కడ ఏం జరుగుతోందో బాహ్య ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. పకడ్బందీగా వ్యూహం రచించి ఆఫ్రికన్ దేశాలకు బియ్యం ఎగుమతులు చేసి కోట్లు కూడబెట్టారు. మన రాష్ట్రంలో గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో గంగవరం పోర్టు నుంచి 2,20,289 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు నుంచి 23,51,218 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం పోర్టు నుంచి 38,02,000 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరిగితే... ఒక్క కాకినాడ పోర్టు నుంచే 1,31,18,346 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరిగాయి. ఒక్క కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి అయిన బియ్యం విలువే రూ. 48,537 కోట్లు అంటే బియ్యం మాఫియా ఏ విధంగా రెచ్చిపోయిందో అర్థం చేసుకోవచ్చు. కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ కంపెనీ నుంచి అరబిందో రియాల్టీకి 41.12 శాతం వాటా బదిలీ అయ్యింది. అరబిందో కంపెనీ పోర్టు టేకోవర్ చేసిన తరువాత ఊహించని తీరిలో 1,31,18,346 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేశారంటే ఏ మేరకు దందా జరిగిందో ప్రజలు అర్థం చేసుకోవాలి' అని మనోహర్ అన్నారు.

# ఏపీ ప్రజలకు సంక్రాంతి కానుక ఇదే..



అమరావతి,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మరో భారీ శుభవార్త చెప్పను న్నారు. సంక్రాంతి కానుకగా మరో సంచలన పథకాన్ని అమలు చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతి సారీ సంక్రాంతి వచ్చిందంటే చాలు రాష్ట్ర ప్రజలకు ఏదో ఒక రూపంలో కానుకలు అందించేవారు. అయితే ఈ సారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టిన కూటమి మరికొద్ది రోజుల్లో రానున్న సంక్రాంతికి ఎటువంటి కానుకలు ఇవ్వనుందో అని ప్రజలలో లోనూ ఆసక్తి నెలకొంది.కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రజలు కూటమి మేనిఫెస్టోలో ఉన్న వాటిని ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేశారు. ఈ తరుణంలో వచ్చే సంక్రాంతికి ఏ పథకాన్ని సీఎం చంద్రబాబు సర్కార్ అమలు చేయబోతోందోనని ప్రజలు వేయి కళ్లతో చూస్తున్నారు. అయితే గతంలో కూటమి సర్కార్ ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం దీనికి సంబంధించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ పథకాన్ని సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో అమలు చేస్తే మహిళలకు మేలు జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ పథకాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు.మరోవైపు ఈ పథకానికి సం బంధించి ప్రభుత్వం ఇప్పటికే పక్క రాష్టాల్లైన కర్ణాటక, తెలంగాణలో ప్రత్యేక బృందాల ద్వారా అధ్యయనం చేసి డీటెయిల్డ్ రిపోర్ట్ తయారు చేసినట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమలు చేయడా నికి కావాల్సిన విధివిధానాలు, ఏ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి, ఆర్టీసీపై పడే భారం, రాష్ట్ర ఖజానాపై పడే భారాలపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం.రాష్ట్రంలోని పలువురు మంత్రులు ఇదివరకే ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. త్వరలోనే ఈ పథకానికి కావాల్సిన, అవసరమైన నిధులు, కేటాయిం చాల్సిన బస్సులు వంటి వాటిపై ఆర్టీసీ అధికారులతో ప్రభుత్వం చర్చలు జరిపే అవకాశం ఉంది. అయితే సంక్రాంతికి కూటమి సర్కార్.. ఉచిత బస్సు పథకం మే కాకుండా తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1,500 ఆర్థిక సాయం పథకాల్లో ఏదో ఒకదానిని అమలు చేసే అవకాశం ఉంది. ఈ పథకాల అమలుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. వీలైనంత త్వరగా ప్రభుత్వం వీటిని అమలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఈ పథకాలు అమలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు భారీ లబ్ది చేకూరనుంది.

# మేడారం అడవుల కేంద్రంగా భూప్రకంపనలు.. నిపుణులకు పరీక్షగా మారిన ప్రాంతం

హైదరాబాద్,ప్రకృతి వైపరీత్యాలకు మేడారం అటవీ ప్రాంతం కేంద్రబిందువుగా మారింది. ఈ ప్రాంతంలో జరుగుతున్న వరుస సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. బుధవారం ఉదయం 7.27 గంటల సమయంలో జరిగిన భూకంపం ములుగు అటవీ ప్రాంతంలోని మేడారం సమీపంలోని రామన్నగూడెం కేంద్రంగా చోటు చేసుకున్నట్టుగా అధికారులు నిర్ధారించారు. వరుసగా జరుగుతున్న సంఘటనలతో ములుగు జిల్లా ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4వ తేదీన మేడారం సమీపంలోని దట్టమైన అడవిలో 50వేలకు పైగా చెట్లు ఒక్కసారిగా నేలకూలిన సంఘటన తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఆ సంఘటనకు పూర్తి కారణాలను తెలుసుకోలేకపోయారు. నిపుణులు దానికి సంబంధించిన విశ్లేషన్లో ఉన్నారు. ఈ సంఘటన జరిగిన మూడు నెలలకు డిసెంబర్ 4న బుధవారం రిక్టర్ స్కేల్ పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించడం ఆందోళన కలిగిస్తుంది.గోదావరి పరివాహక ప్రాంతంగా ఉన్న మేడారం కేంద్రంగా 40 కిలోమీటర్ల లోతులో ఏర్పడిన ఈ భూకంపం ప్రభావం 225 కిలోమీటర్ల విస్తీర్ణంలో తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, మహారాష్ట్రల్లోని పలు ప్రాంతాల్లో సంభవించినట్టుగా అధికారులు తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేట్ పై 5.3గా నమోదయినట్టుగా ప్రాథమికంగా తెలుస్తోంది. భూకంపానికి గల కారణాలు ఏమిటీ అన్న విషయంపై సిస్మలాజికల్ విభాగం నిపుణులు పూర్తిస్థాయిలో పరిశోధనలు జరుపుతున్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంతో పాటు సమీపంలో బొగ్గు గనులు కూడా ఉన్నాయి.

మేడారం సమీప ప్రాంతంలో

ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతం కేంద్రంగానే జరిగిన భూకంపం సంచలనంగా మారింది. సెప్టెంబర్ 4న ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతంలో ప్రకృతిలో పెను మార్పులు సంభవించిన సంగతి తెలిసిందే. సుడిగాలుల బీభత్సం కారణంగా 50 నుండి 70 వేల మేర చెట్లు నేలకూలిపోయాయి. సుడిగాలి తీవ్రత ఏ స్థాయిలో చోటు చేసుకుందంటే చెట్ల వడిపెట్టినట్టుగా చుట్టుకపోగా ఇరువైపులా వంగిపోయాయి. మరికొన్ని చెట్లు అయితే చీలికలు కాగా ఇంకొన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించబడ్డాయి. దేశంలోనే అత్యంత అరుదైన ఘటనగా అటవీ శాఖ అధికారులు సెప్టెంబర్ 4న జరిగిన ఘటనపై వివరించారు. పరిశోధనలు జరిపేందుకు నిపుణులను కూడా రంగంలోకి దింపుతున్నామని అటవీ శాఖ అధికారులు అప్పుడు ప్రకటించారు. తాజాగా బుధవారం వచ్చిన భూకంపం కూడా ఇదే ప్రాంతంలో సంభవించిందని సిస్మోలాజికల్ విభాగం నిర్ధారించడం గమనార్హం. మేడారంలో గాలి దుమారం రేకెత్తిన ఘటన జరిగిన సరిగ్గా మూడో నెల రోజునే భూకంపం సంభవించిడం సంచలనంగా మారింది. సెప్టెంబర్ మొదటి వారంలో మేడారం అడవుల్లో ప్రకృతి ప్రళయం



సృష్టించగా, డిసెంబర్ 4న భూకంపం సంభవించడం గమనార్హం.

పరిశోధకులకు పరీక్ష

మేడారం అడవుల్లో సెప్టెంబర్ 4న చోటు చేసుకున్న సుడిగాలుల ప్రభావంపై అటవీ శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మీడియాతో మాట్లాడుతూ సహజంగా చెట్లు భూమి లోపల కూడా విస్తరించుకుంటాయని, వేర్ల ద్వారా భూమి లోపలి నుండి వృక్షాలకు అవసరమైన పోషక విలువలు అందుతుంటాయని అన్నారు. అయితే ములుగులో మాత్రం ఈ పరిస్థితికి భిన్నంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలోని గాలిలోనే చెట్లకు అనుకూలమైన పరిస్థితులు ఉండడంతో భూమి లోపలకు చెట్లు విస్తరించడం లేదని వెల్లడించారు. గాలి దుమారం వల్ల భారీ వృక్షాలు కూడా నేలకూలిపోవడానికి కారణం అయి ఉంటుందని భావిస్తున్నామన్నారు. అప్పుడు ఇవే అటవీ ప్రాంతంలో వాటర్ స్పౌట్స్ కూడా ఏర్పడడంతో అక్కడ నీటి వనరులు కూడా విస్తారంగా ఉండడమే కారణమనే అంచనా వేశారు. కానీ తాజాగా ఇదే ప్రాంతంలో వచ్చిన భూకంపం నిపుణుల పరిశోధనలకు ప్రతిష్టగా మారింది. అప్పుడు పరిసర ప్రాంతాల్లో పెద్ద వరదలు సంభవించి చెట్లు ధ్వంసం అయ్యాయి. కానీ ఇప్పుడు భూకంపం అదే అటవీ ప్రాంతం కేంద్రకంగా చోటు చేసుకోవడంతో పరిశోధకులు లోతుగా పరిశోధించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

## రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్

హైదరాబాద్,రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్ నియమితుల య్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న బుర్రా వెంకటేశం వీఆర్ఎస్ తీసుకోవడంతో ఖాళీ ఆయన స్థానంలో దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దాన కిశోర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ట్రాఫిక్ విధుల్లో 44 మంది ట్రాన్స్ జెండర్లు



హైదరాబాద్,హైదరాబాద్ లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో ట్రాఫిక్ పోలీస్ డిపార్ట్ మెంట్లో ట్రాన్స్ జెండర్ల నియామకాలు కొనసాగుతున్నాయి. తొలిసారిగా సిటీ కమిషనరేట్ పరిధిలో సెలెక్షన్స్ జరిగాయి.గోశామహల్ స్టేడియంలో ట్రాన్స్ జెండర్స్ కి ఈవెంట్స్ నిర్వహించిన అధికారులు.. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరిశీలించారు. రన్నింగ్, హై జంప్, లాంగ్ జంప్ లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. సెలెక్ట్ అయిన వారికి ట్రైనింగ్ ఇచ్చి ట్రాఫిక్ లో అధికారులు నియమించనున్నారు. ఈరోజు ఈవెంట్స్ లో పాల్గొన్న 58 మంది ట్రాన్స్ జెండర్స్ ఉండగా.. 29 మంది ఉమెన్స్, 15 మంది మెన్ ట్రాన్స్ జెండర్ అభ్యర్థుల ఎంపిక అయ్యారు.కాగా, మొత్తం 44 మందిని ఈవెంట్స్ తర్వాత అధికారులు సెలెక్ట్ చేశారు. 800 మిటర్స్ రన్నింగ్, 100 మిటర్స్ రన్నింగ్, షార్ట్ పుట్, లాంగ్ జంప్ ఈవెంట్స్ నిర్వహించారు. 18 ఏళ్లు పూర్తైన వారు.. 10వ తరగతి సర్టిఫికెట్స్, ట్రాన్స్ జెండర్ సర్టిఫికెట్ ఆధారంగా అభ్యర్థులకు అధికారులు ఈవెంట్స్ నిర్వహించారు. ఇక, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.. సిటీలో 85 లక్షల వాహనాలు ఉన్నాయి.. రోజుకు 1500 వాహనాలు కొత్తగా వస్తున్నాయి.. ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. మలక్ పేట్ నుంచి గోల్కొండ వరకు నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై చర్చించామని సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com